GHATIKACHALA MAHATYAMU

(Navajyothi Classics)

By

Tenali Ramakrishnaka vi

First Edition :

August '73.

Printers :

SREE PRINTERS
Vijayawada–2.

11368
శాఖా గ్రంథాలయము
చీరాల.

Cover Design :

TRIGUN
Vijayawada–2.

Publishers :

NAVAJYOTHI PUBLICATIONS
Ellore Road
VIJAYAWADA–2.

Price :

Rs 2-50

శాఖా గ్రంథాలయము

తెనాలిరామకృష్ణకవి
ఘటికాచలమహాత్మ్యము

విద్వాన్ దేవరకొండ చిన్నశేషప్పశర్మ

నవజ్యోతి పబ్లికేషన్స్
మెయిన్ రోడ్ - విజయవాడ 2

ఘటికాచల మాహాత్మ్యము

శ్రీ మనోహరమైనది నైమిశ వనము. అందు మహా ఋషులు పురాణ కథా మర్మజ్ఞుడైన సూతముని వలన నానా పురాణ గాథలు వినుచు, ఒకనాడు ఈ విధముగా అడిగినారు.

"నిఖిల పురాణ కథా రత్నఖనీ! సూతమునీ! సకల లోక రక్షా పరాయణుడైన నారాయణుడు వెలసియుండు పుణ్య క్షేత్రములయందు శ్రీదేవీ విహార రమ్యమును, ఆద్య మును, సురవర సేవ్యమును పరమ భవ్యమును అగు నెలవు ఏదయిన ఉన్నచో మాకు తెలుపవా!"

మునులు ఇట్లు అడుగగగా సూత మహర్షి యీ విధముగా చెప్పిగాడు.

"పూర్వము భృగు మునీంద్రుడు నారద మహర్షిని ఇట్లే అడిగినాడు. ఆ మహర్షి ఆ మునీంద్రునికి చెప్పిన విశేషమే నేను మీకు వినిపించెదను. సావధానముగా ఆలింపుడు!

"మానస సరస్సు మీ కెఱిగినదే కదా! అందు పండు వెన్నెలల సోకున కఱగెడి చంద్రకాంత శిలలు ఈను చుండు ప్రవాహములచేత పరిసరములన్నియు జలపూరిత ములై యుండును. జలచరములను ఆరగింప వచ్చిన నీటి పక్షుల కలరవములచేత ఎల్లప్పుడును కలకలము నిండి యుండును. సురలకు మునివరులకు భూసురులకు దుర్లభము లయిన ముక్తి మాత్రికి సరములు కొల్లలై యుండును. తేనెతో నిండిన తామరల చుట్టును కలువల చుట్టును తుమ్మెదలు రొద చేయుచు సంచరించు చుండును. చివురు టాకుల పలె ఎఱ్ఱని జడలు క్రమ్మికొనియున్న ఫాలతలములందు చంద్రునివలె తెల్లనగు భస్మము దాల్చియుండు సమాధిష్ఠులైన ఋషిపుంగవులు గోచరించుచుందురు.

ఆ సరోవరము లక్ష్మీ హస్తమువలె కంకణములచేత (నీటి బిందువుల చేత – కడియముల చేత) అలంకృతమై యుండును. సముద్రమువలె ఎల్ల వేళలందును ముక్తాకలితమై (ముత్యములతో కూడినదై – ముక్తి పొందినవారి చేత

బాగుగా కూడుకొన్నదై ఉండును. రామకథ విధమున మరు త్కుమార వార్తాకరమై (హనుమంతుడు వినిపించు వార్త లకు తానై - పిల్ల గాలుల సందడులకు తానై) యుండును. మేరు పర్వతము చందమున సుమనోఽభివృద్ధితో (పువ్వుల పెంపుతో - దేవతల అభ్యుదయముతో) అతిశయించు చుండును. లంకాపురము మాదిరి పుణ్య జన సమేతమై (రాక్షసులతో కూడినదై, పుణ్య పురుషులతో కూడినదై) శోభిల్లుచుండును.

ఆ కమలాకరమునందు కమల కన్యకును సహస్ర కిరణునకును ప్రతి దినము వివాహము జరుగుచున్నట్లే యుండును. ఆ పెండ్లికి రాజ హంసల తొక్కల గాలులకు ఎగుళ్ళు చుండెడి తామర పుప్పొడియే పటవాసరజము.

మేటి బిందువులు అనెడు ముత్యాలతో నిండిన ఆకుల నడుమ కల ఎఱ్ఱ దామరలే రత్న కలశములు. గాలికి ఎగసి ఆకాశమున తెప్పవలె వ్యాపించి యున్న తెల్లని పరాగమే చాందినీ. అడు తుమ్మెదల సంగీతములే ముత్తైదువలు పాడు సోభాన పాటలు (పెండ్లి పాటలు). పక్షుల కలకల ధ్వనులే బ్రాహ్మణుల మంత్ర ఘోషములు. రాలుచుండెడి కేసరములే తలంబ్రాలు.

ఆ మానస సరస్సు బడ్డుననే భృగు మహర్షి ఆశ్రమము ఉన్నది. తీర్థ కాంక్షచేత వచ్చి పోవుచుండు దేవతలును మునులును అందే విశ్రమించుచుందురు. అందు

శ్రీహరి దక్షిణ నేత్రము (సూర్యుడు) వికాసము పొందియు పొందక మునుపే పర్ణశాలలందుఁ గల ముని కాంతలకు సంతసముగా చమరీ మృగములు తోఁకలను విచుచు వాకిళ్ళు తుడుచును. ఏనుఁగు పిల్లలు తొండములతో తీర్థ కుంభములు తెచ్చి అంతటను కలయంపి చల్లును. ఎలుఁగుబంట్లు చిక్కని బురదవంటి పచ్చ కస్తూరిని తెచ్చి అలుకును. చిలుకలు ఏనుఁగుల కుంభస్థలముల నుండి రాలిన ముత్యములతో రంగవల్లికలు తీర్చును. చిలుకలు వేదములు చదువును. గోవు వంకలు ధర్మ మర్మములు ఇతిహాస కథలు ప్రశంసించుచుండును. నెమళులు శేష భాషా విశేష కళాలు శాస్త్రములు (శేషుని చందమున కళాశాస్త్రములు)ను పన్యసించుచుండును. తుమ్మెదలు శ్రీకృష్ణుని దివ్య నామములను సంగీత ధోరణిలో పఠించును.

ఆ ఆశ్రమములో ఒక చిత్ర మున్నది. అన్ని జాతుల పక్షులును సంధ్యలందు మునులకంటె ముందుగానే నిద్రించి మేలుకొనుచు సమాధి యం దుండి తారక మంత్రోచ్చారణాసక్తితో అతిశయించుచుండును.

ముని బాలకులు పండ్లు దర్భలు మొదలగువానికై అడవికి వెళ్ళినప్పుడు మహా సర్పములు వచ్చి వారికి ఎండ తగులకుండ తమ పడగలను గొడుగులుగా అడ్డు పెట్టును. అంతలో నెమళ్ళు వచ్చి "స్వాములకు మే మెనర్చిన నేర మేమి? మీ పనులు న్యాయములా!" అనుచు నీడ కలుగుటకై పింఛములు విప్పును. పులులు లేడి పిల్లలను సాకును.

బాగుగా కూడుకొన్నదై ఉండును. రామకథ విధమున మధు ష్కమాత్ర వార్తాకరమై (హనుమంతుడు వినిపించు వార్త లకు తావై - పిల్ల గాలుల సందడులకు తావై) యుండును. మేరు పర్వతము చందమున సుమనోఽభివృద్ధితో (పువ్వుల సొంపుతో - దేవతల అభ్యుదయముతో) అతిశయించు చుండును. లంకాపురము మాదిరి పుణ్య జన సమేతమై (రాక్షసులతో కూడినదై, పుణ్య పురుషులతో కూడినదై) శోభిల్లుచుండును.

ఆ కమలాకరమునందు కమల కన్యకును సహస్ర కిరణునకును ప్రతి దినము వివాహము జరుగుచున్నట్లే యుండును. ఆ పెండ్లికి రాజ హంసల జెక్కలు గాలులకు ఎగుర చుండెడి తామర పుప్పొడియే పటువాసరజము.

నీటి బిందువులు అనెడు ముత్యాలతో నిండిన ఆకుల నడుమ కల ఎఱ్ఱ దామరలే రత్న కలశములు. గాలికి ఎగసి ఆకాశమున తెప్పవలె వ్యాపించి యున్న తెల్లని పరాగమే చాందినీ. అడు తుమ్మెదల సంగీతములే ముత్తైదువలు పాడు సోబాన పాటలు (పెండ్లి పాటలు). పక్షుల కలకల ధ్వనులే బ్రాహ్మణుల మంత్ర ఘోషములు. రాలుచుండెడి కేసరములే తలంబ్రాలు.

ఆ మానస సరస్సు ఒడ్డుననే భృగు మహర్షి ఆశ్ర మము ఉన్నది. తీర్థ కాంక్షచేత వచ్చి పోవుచుండు దేవత లును మునులును అందే విశ్రమించుచుందురు. అందు

సింహములు ఏనుఁగు పిల్లలను పోషించును. కాకులు గ్రుడ్లఁ గూబలతో విహరించును. పిల్లులు ఎలుకలను కాపాడును. వెమిళ్ళ తమ పించముల నీడలందు ఉంచి పాములను లాలించును. మహర్షుల యజ్ఞశాలలనుండి పుట్టిన పొగలు ఆకాశగంగలో మునిఁగి వెళ్ళుచుండెడి దేవకాంతల ముంగురుల ముందు నాఁబ్రాణి ధూప మాలికలువలె ఒప్పుచుండును.

ఆ వనము నందలి కొదమ తుమ్మెదలు శ్రీహరికి అర్పించిన పిమ్మటనే కాని తేనెలను మూతితో ముట్టవు. కోకిలములు వనమాలికి నివేదించిన తరువాతనే కాని చివురాకులు కొఱుకవు. లేళ్ళ మాధవునికి సమర్పించిన పిదపనే కాని లేత పచ్చికలు కబళింపవు. చిలుకలు గోవిందునకు ఫలములు అప్పన చేసికాని ఆరగింపవు. ఇతరజంతువు లయిన హరిని స్మరించి కాని యే కార్యమునకును పూనుకొనవు. ఆ తపోవనము ప్రభావమును వర్ణించుట వేయి నోళ్ళ గల ఫణిపతి కయినను వశ మగునా?

సాధువులు కొనియాడునట్టి ఆ ఆశ్రమమునందు భృగు మహర్షి యితర తాపసులతోఁ గూడ విష్ణుధ్యానపరాయణుఁడై ప్రొద్దులు పుచ్చుచుండును. అందు గోవ జవ్వాజి కటికి యెండల కాఁక చేత కఱఁగి కమ్మని తావులు చిమ్మచుండును. కమ్మని తామర వలపులను కానుక లిచ్చు చల్లని గాలి సోఁకుచుండును. ప్రాఁతియందు చిగురులు పుట్టినట్లు కిన్నర యువతులు గానము చేయుచుందురు. తామర తూండ్లు మేసి చక్రవాకములు కొసరు పలుకులు పలుకుచు

జంటలుగా విహరించుచుండును. రాచిలుకలు తియ్యని మామిడి పండ్లు తినుచు ముద్దుముద్దుగా పలుకుచుండును. అయినను ఆ ముసీంద్రుడు ఇంద్రియములను చెదరనీయక శ్రీహరిని ధ్యానించుచుండును.

ఇట్టి సమయమునందు ఒకనాడు శరత్కాలపు మబ్బు వంటి శరీరముతో, మెఱుంగులవంటి ఎఱ్ఱని జడతో, కల్ప వృక్షపు విరిగు త్రివంటి మణి కమండలువుతో, కైలాసము వొంతఁ గల మబ్బువంటి కృష్ణాజినముతో, ఆకారము దాల్చిన అక్షరములవంటి స్ఫటికపు పూసల దండతో, గాలి తాకున విష్ణు కీర్తనలు పలుకుచుండు మహాత్మతో పాదరసమును తిరస్కరించు తేజస్సుతో భక్తులను పైరులకు నారదుఁడు (మేఘుఁడు) అగు నారదుఁడు వచ్చినాడు.

భృగు ముసీశ్వరుఁడు ఆ బ్రహ్మ మానస పుత్రునకు అతిథి సత్కారములచేత సంతృప్తి కలిగించి యిట్లు పలికినాఁడు.

"నారదా! రుచి జిత శారద నారదా! (కాంతి చేత శరత్కాలపు మబ్బును జయించినవాఁడా!) పుష్కరాది తీర్థములయందు ఒప్పు ధర్మములను, వాని మహిమలను విష్ణు క్షేత్రముల పవిత్ర చరిత్రలను సద్గుణాతిశయము చేత ప్రసిద్ధి కెక్కిన వైష్ణవోత్తముల కథలను వినిపించి నాకు పాప విముక్తి కలిగింపవా? నీవు ఎచ్చటినుండి యిచ్చటకు వచ్చినావు? అహా! నా భాగ్యమే మని పొగడవచ్చును?"

ఈ పలుకులకు నారద ముసీంద్రుఁ డిట్లు ప్రత్యుత్తర మిచ్చినాఁడు.

"భృగు ముసీశ్వరా! సకల రత్నములకు నిలయము, అప్సరసల జన్మభూమి; కల్పవృక్ష సముదాయమునకు ఉనికి పట్టు, నారాయణునికి యోగనిద్రా స్థలము, లక్ష్మీదేవికి పుట్టిల్లు, దేవతలకు భోజనశాల, ద్వీప కోటులకు ప్రాపు, నదీ కాంతలకు ప్రాణ పతి, కలుపల చెలికానికి కన్నతం డి, మైనాకునికి వజ్ర కనచము అగు సాగరము జలజ నేత్రునకు నివాస నగరముకదా! ఆటంకము అనెడు పంకము (బురద, లేనిది పాపము)ను గూర్చిన శంకకు తావు), నిత్య సత్య హిత మగుటచేత పవిత్రము, శీతా తపములను (చలిని ఎండను) సహింపఁగల యోగులచేత ప్రకాశించునది అయి ఆ క్షీర సాగరమునందు శ్వేత ద్వీపము ప్రకాశించుచుండును.ఆ శ్వేత ద్వీపమునందు లోకాతీతమై, అపాయము లేనిదై, నిత్య నూత్న తేజమై, మహా మహిమ కల వైకుంఠపురము సకల సంపదలతో అలరారుచుండును.

ఆ వైకుంఠ పురము కనగము ఇంద్రనీల మణులు కూర్చి నిర్మించిన కోట గోడలును కల్పవృక్షములును, మందర గిరికి సాటి వచ్చు మందిరములును, యోగి మండ లములును, తామరలు కలువలు గల సరోవరములును, సుర విమానములును,పూర్ణిమనాఁటి చందమామ వంటి మోములు గల భామలును, మణి మందిరములును, చిగుళ్ళను పువ్వు లును పండ్లను ఒప్పారు వనములును, దివ్యలోక పావను

లును గలిగి శాశ్వత మోక్షభాగ్య నిలయమై అలరారు చుండును.

అక్కడ మెత్తని గాలి దూది పానుపు లెన్ని ఉన్నవో! అందఱును నాగరాజ శయనులే. దివ్య నదు లెన్ని కలవో! అందఱి పాపముల యంచును దివ్య నదులే. ఎన్ని మాణిక్యములు పుట్టుచుండునో ! అందఱును కౌస్తుభ హారములు ధరించి యుందురు. సూర్య చంద్రు లెంద ఱున్నారో! అందఱును సూర్యచంద్రులు కన్నులుగా గల వారే. గరుత్మంతు లెంద ఱున్నారో ! అందఱును గరుడ ధ్వజులే. అక్కడ ధీరులు నారు పోసినట్లు కాపుర ముున్నారు.

అందు ఒక కేళీ భవనమునందు చంద్రునివలె మనో హారమగు శయ్యయందు లక్ష్మీదేవిని కౌగలించుకొని ఆనంద రస సముద్రమునందు తేలుచు, ఎల్లప్పుడును సనకాది యోగీ శ్వరుల సేవలు గొనుచుండు సర్వేశ్వరుడైన వాసుదేవుని సేవించి, భూలోకము నందలి విష్ణు క్షేత్రములను దర్శించి నాను."

నారదుడిట్లు చెప్పగా 'నా కా విష్ణు క్షేత్రముల చరిత్రలే చెప్పు' మని భృగుముని అడిగినాడు. అంతట దేవ మునీంద్రుడిట్లు చెప్పినాడు.

"తలగడగా కీలించిన చేతియందు విశ్రాంత మైన శిరస్సు తామరలోని తుమ్మెద దోరయో అనిపించునట్లు

శయనించి, లంకాభి ముఖుడుగా కాన్పించు రంగధాముడు కోటి సూర్యధాముడై భక్త పరాధీనుడై ఉండును. ఆ స్వామి ఉత్తమాంగమున పూనిన రత్న కిరీటము కాంతులు కన్నులకు మిఱుమిట్లు గొలుపును. ఆ నీలమేఘ శ్యామలమైన శరీరము బ్రహ్మ వేటి పుష్కరమున మదించిన తుమ్మెదవలె సొగసుమీఱి యుండును. ఆ విశాలమైన వక్షమునందు లక్ష్మితో సాటికై చేరిన భూదేవియో అనునట్లు శ్రీవత్సము శోభిల్లుచుండును. కౌస్తుభ హారము కనక కుండలములు, నానావిధ మణిహారములు, భుజ కీర్తులు నిత్య నూతనము లయిన ప్రభలను వెదచల్లుచుండును. కావేరీ తీరమున సప్త సాలముల నడుమ వెలసియున్న రంగ మందిరమునందు శేష శయనుడై యుండు ఆ రంగధాముడు ఎంత చూచినను చూడదగి యుండును.

అచ్చటికి ఈశాన్య దిక్కున తిరువాళ్ళూరునందు మునివాహనుడను మునీశ్వరుని ప్రోచుటకై వెలసియున్నాడు జనార్దనుడు. పరాశర మునీంద్రుని కృతార్థునిగావించుటకై అసురహరుడైన శ్రీ నృసింహుడు లెంజాపురమునందు నెలకొని యున్నాడు. శ్రీరంగమునకు మూడామడల దవ్వున కావేరి ఒడ్డున నంబిలను గ్రామమునందు సౌందర్యనాథుడైన శ్రీనాథుడు వేంచేసి యున్నాడు. కదంబనూరను పురమునందు దేవేంద్రుడు, బ్రహ్మ, పరమే

శ్వరుడు కొలిచి యుండగా ఉష్ణమగు వ్యాధి భక్తులకు కొంగు బంగారమై యుండును. తిరువెళ్ళగపురమున శ్వేత గిరిమీద దేవకాంతల అర్చనలు అంగీకరించుచు, పుండరీక లోచన దేవుడు మహా వైభవముతో ఒప్పుచుండును. కుంభఘోణ పురమునకు వాయవ్య దిక్కున రెండు క్రోసుల దూరమున కబంధ విరాధులను ఖండించిన రఘునాథుడు బుదకుడిలో పూజితుడగుచున్నాడు. రంగస్థలమునకు యోజనము దవ్వున తూర్పు దిక్కున తిరుపేర్నహార్పుర మున అనంత శయనుడు అర్చానుకూల మూర్తియై యున్నాడు. కుంభఘోణమునకు వాయవ్య కోణమున నాద నూరియందు ప్రహ్లాదాదుల పూజ లందుకొనుచున్నాడు యోగీంద్ర యోగవర్ధిష్ణుడు విష్ణుడు. కుంభఘోణమునకు తూర్పునందు తిరువళందూరునందు పావక దేవునకు ప్రస న్నుడై యున్నాడు గోపికా మనోహరుడు. కుంభఘోణ మునకు ఆగ్నేయ దిక్కునందు చిరుప్పూరియందు వైభవ దాయి శేషశాయి వరదుడై యున్నాడు. సిరిచిర్పురము నందు సురేశ్వర మహేశ్వరుల సేవ లంగీకరించుచు గోవర్ధనో ద్ధారకుడయిన బాలకృష్ణుడు ప్రత్యక్షమై యున్నాడు. చొక్కుణ్ణారు పురమునందు కేశికుని యజ్ఞ వేదికయందు ఉదయించి రక్కసులను కూల్చి దాసుల అక్కఱలు దీర్చు చున్నాడు జనార్దన దేవుడు. కుంభఘోణమున కాంచన పుష్కరిణియందు జన్మించిన పద్మాదేవిని పరిణయ మాడి కాంచన మునికి ప్రసన్నుడై యున్నాడు శార్జపాణి తిరు

కండి యూరిలో రాక్షస సంహారార్థము వెలసిన ఆదినారా యణుడు దేవతలకు అభయప్రదుడై యున్నాడు. తిరువణ్ణ హార్పురమునందు వేంకటేశ్వరుడు, తిరుకణ్ణ పురవరములో చతుర్భుజుడు, తిరునగరిలో తిరుమంగయాళ్వారును కటా క్షించుచుండు నారాయణుడు, తిరువాలిమణవాళమున నాగపట్టణ వేంకటేశుడు, తిరువణయ్యూరునందు కమలా రమణుడు వేంకటరమణుడు, నందిపుర విణ్ణహర నగరిలో శ్రీ సనాథుడైన జగన్నాథుడు దర్శనీయులై యున్నారు. తిరువిందళూరయందు సకలసుర సేవితుడై వరప్రదుడైన సుగంధివననాథుడున్నాడు రమానాథుడు.

చిత్రకూటమునందు ఎట్టి దామర తొలని చెంత గోవిందరాజస్వామి, శ్రీరామవిణ్ణహరీపురమున త్రివిక్రమ దేవదేవుడు, తిరుకూడలూర్పురమునందు దయాంబుధిరాజు వరదరాజు, తిరుక్కణం గుడియందు శ్రీ సౌఖ్యవర్ధిష్ణుడు చిన్ని కృష్ణుడు, తిరుకణ్ణ మంగాపురమున దివ్య ప్రభా వుడు భక్తవత్సల దేవుడు, హనుమంతుని కోరిక దీర్చు టకు కపిస్థలమునందు గజేంద్ర వరదుడు భక్తులకు కామిత ప్రదులై యున్నారు.

తిరువెళ్ళి గుడియందు భరతాదు లయిన నలువురు తమ్ములతో, సీతాదేవితో ఆంజనేయ పూజితుడై యున్నాడు రాఘవ దేవుడు. తిరుణాంగ పత్తనమునందు మాణిమాద కోవెల, తిరువెళ్ళకోళంబు, తిరుమణి కూడవ, ణ్పురుషోత్తమములు, శంబొజై కోవెల, పొత్తం

పల్లి, అరిమేయ విణ్ణహారము, కావళంబాడి. వైకుంఠ విణ్ణ హారము, శిరువత్తెవ నార్తోహము, తిరుత్తెత్తియము, అను ఏకాదశ స్థానములందును దాసుల కోరికలను తీర్చగోరి సన్నిధి చేసియున్నాడు జగన్నాథుడు.

ప్రళయ సముద్రమునందు మునిగిన భూచలయమును ఉద్ధరించుచుండు కీర్తియే రూపము ధరించినదేనో అనునట్లు శ్రీకృష్ణదేవుడు ఆదివరాహమూర్తియై ఆర్తులకు అభయ మిచ్చుచున్నాడు. ఆశ్రితజనాధారుడై మన్నారు కోవెల యేలుచున్నాడు రాజగోపాలుడు. పాపనాశన పురమునందు వసించుచున్నాడు ఎల్ల రాజుల ప్రొక్కలందుకొను వరద రాజు. పాండ్యదేశమున అలహార్తిమల యను పురమున వేంకటేశ్వరుడు విలసిల్లుచున్నాడు. తిరుకోటి యూరిలో ద్రౌపదీ మాన సంరక్షకుడైన కృష్ణదేవుడు కలడు. తిరు మెయ్యి విణ్ణపురమును పాలించుచున్నాడు సత్యగిరీశుడు. తిరువుళ్ళాని పురమున మునులతో కూడి యున్నాడు రామ భద్రుడు.

తిరు తంగాల్పురమునందు నారాయణుడు, తిరు మోహూడ్పురియందు కాలమేఘుడు, దక్షిణమధుర యందు కూడల వరియ వేలుపు, కురు విత్తురీపురమున కృష్ణదేవుడు, శ్రీవిల్లి పుత్తూరునందు మన్నవారు స్వామి. తిరునగరియందు ఆదిలక్ష్మీనాథుడు, తులవెళ్ళి మంగాపురమునందు పుండరీ కాక్షుడు, వరమంగపురమునందు లక్ష్మీ సమేత నారా యణుడు, తెందురుప్పేర్పురపురమునందు కేశినేంద్రస్వామి,

వైకుంఠ వాసుఁడై వైకుంఠ సంధాయకుఁడగు వైకుంఠ నాథుఁడు, తిరుప్పులి గుడిపురమును పాలించు భూమపాలుఁడును. మంగపట్టణ మణిమంటపమునందు అలరారు విజయాసన దేవుఁడును. కుళింద నగరమునందు సుస్థిరుఁడయిన నవనీత చోరుఁడును, తిరుకురుంగుడి పురము నందు దానవాంతకుఁడును, తిర్కోలూరి పురి శౌరియును, అనంతపురమున అనంతశయనుఁడును. సాధుజనయిత్రి వన్పురములో శ్రీవత్సవక్షుఁడు, తిరుక్కాత్కరమున అప్పదేవుఁడును, తిరుమాడి కలమున పుండరీక నేత్రుఁడును. కుట్టనాప్తిరుపులి యూర్పురమున అపూర్వనాథుఁడును, తిరుచెంగణూరున దేవదేవుఁడును, తిరుణావై నగరమున బ్రహ్మచేత అర్చితుఁడగు దేవదేవుఁడును, తిరువణ్ణ వార్నగరమున మన్నవారు స్వామియును, తిరువందూర్పురమున అర్జునసఖుఁడైన ప్రవాళాధరుఁడును, తిరువత్తూరమునందు కేశవస్వామియును, ఉత్తచుక్కొండయందు అనన్య గతి నాథుఁడును, తిరుక్కుడి స్థానమునందు నరసఖుఁడగు నారాయణుఁడును, తిరువారునందు బాలకృష్ణుఁడును. తిరుమందివెళ్ళ నగరియందు శ్రీదేవనాథుఁడును, తిరుక్కోవలూర్పురమునందు శ్రీ కృష్ణుఁడును అలకా నగరమువంటి కాంచీపురమునందు యజ్ఞవేదియందు వెలసి కరిగిరిపై నిలిచిన వరదరాజును. వేగవతీ జనకుఁడయిన వేగవతీదేవుఁడును, పరమేశ విణ్ణహర ప్రాంత కాంచీ స్థలమున చోళాధీశుఁడు చిన్నికృష్ణుఁడును, తిరుప్పాడహమున పార్థసారధియును. అత్తిరుంగమున ప్రదీపస్వామియును, కామాక్షి బిలర తింగళ్ తుండధామ వాసుఁడు తుండధామ దేవుఁడును,

వెళుక్కుమను క్షేత్రమున శ్రీ నృసింహుడును, నందతిరువర సరమున చోళహరందుడును, భక్తజనులపాలిటి కామధేనువులు. కారహకల్ప నూర్పురము, కార్యనము శ్రీహరి క్షేత్రములు. వీక్ష్యావన క్షేత్రము దర్శన మాత్రమునచే ఫలప్రదము. అందు శాలిహోత్రముని ప్రార్థనచేత వీరరాఘవుడు వెలసియున్నాడు. కాంచికి చేరువనే అట్ట భుజంగనిలయమున్నది. అందు హరి అర్చితుడగుచున్నాడు. తిరునిన్ఱయూర్పురము నందు వివిధ భోగ నివేశుడయిన వేంకటేశుడున్నాడు. తిరుప్పుకులీ గ్రామమున విజయరాఘవస్వామి కలడు. తిరునిర్మలము నృసింహక్షేత్రము. తిరువదవ్వందపురము లక్ష్మీ వరాహస్వామి నిలయము. తిరుకడమడ పెరుమాళ్ళ దేవుని ఆవాసము.

ఘటికాచలము కారుకణ్ణి నరహరిక్షేత్రము. అయోధ్య శ్రీరామచంద్రాలయము. పాదధూళిచేత అహల్యను నాతిగాజేయు పవిత్రత, సీతాకళ్యాణమునకు శివధనుర్భంగము ఉంకువ గావించు భుజబలము, బాణాగ్రమునందు సముద్రమును అణిముత్తెముపలె ఉంచిన నేర్పు, రావణాదులయిన రాక్షసులను శస్త్రాగ్ని జ్వాలలందు శలభములుగాజేయు శౌర్యము తనవిగా వెలసి లక్ష్మణభరత శత్రుఘ్న సుగ్రీవ హనుమద్విభీషణాదులు, అఖిల మునులు సేవించుచుండగా, దయాసాంద్రుడు రామచంద్రుడు అందు రాజిల్లు చుండును. యశోదానందుల తపఃఫలమగు శౌరి అందనాచలమునందు అలరారుచుండును. తిరువక్కణి దివ్యమందిరమున కృష్ణుడు

అర్జునరథము నధిరోహించి యుండును. అహోబల పర్వత మును నృసింహస్వామి పాలించుచుండును.

చిట్టి ముంగురులు మొగమున ప్రకమ్మికొనియుండగా, తల మీఁద చలిది చిక్కము విఁతచెలువముగా అమర్చి కొని, గొల్లపడుచుల ఉల్లములను కొల్లగొట్టు దిస్స మొలరు గచ్చకాయలతిత్తి కూర్చుకొని, మూఁడు పంకులుగా నిలిచి మురళి ఊఁదెడు చక్కఁదనము అద్భుతముకాఁగా, చిఱు నవ్వుల వెలుఁగులు చేతియందలి శంఖమునను మఱింత పన్నె పెట్టునవికాఁగా, భీమనదీ దక్షిణతీరమున సాక్షాత్కరించి పుండరీకుని సంరక్షించిన పాండురంగ విట్ఠలుఁడు కోటి సూర్య ప్రభా భాసమానుఁడై యుండును.

యాదగిరి యందున్నాఁడు రసికాగ్రేసరుఁడు చళ్ళం పిళ్ళ రాయఁడు. సాలగ్రామ పర్వతమున స్వయంవ్యక్తుఁడైన దీనాధినాథుఁ డున్నాఁడు నైమిశారణ్యమునందు జ్వాలా నృసింహస్వామి నెలకొని యున్నాఁడు. శ్రీరంగాంతర క్షేత్రమున శేషశయనుఁ డున్నాఁడు. బదరీ వనమున అర్జున ప్రాణసఖుఁడైన నారాయణుఁడు దర్శనమిచ్చుచున్నాఁడు. మధు మాధవుఁడు ప్రయాగమున వెలసియున్నాఁడు. తిరు వేఁకటాద్రి మణి మందిరమునందు భూలక్ష్మీసేవితుఁ డగు బాలముకుందుఁడు కన్నుల పండువ గావించుచున్నాఁడు. లక్ష్మీసనాథుఁడు జగన్నాథుఁడు పురుషోత్తమ క్షేత్రము నేలు చున్నాఁడు వైకుంఠ స్వామిభాగవతులతో వైకుంఠ క్షేత్రము నందు వసించుచున్నాఁడు. కలశాబ్ధియందలి శ్వేతద్వీపము

నందు శేషశాయి సేవలందుకొనుచున్నాడు. మధురాపురీ హేమ మందిరమునందు రమావిలాసుడు రత్నమయసౌధ వాసుడై తేజరిల్లు చున్నాడు. తిరున్వేలి అనుపేర ప్రసిద్ధమైన తిర్వార యిప్పాడియందు శ్రీసతీయుక్తుడైయున్నాడు శౌరి. ద్వారకాపురమున శ్రీకృష్ణుడు భక్తపరిపాలకుడైయున్నాడు.

నేను తీర్థయాత్రాపరుడనై యీపుణ్యక్షేత్రములను శ్రీమన్నారాయణుని బహువిధములయిన అర్చామూర్తులను దర్శించి సేవించినాను. శమ్యాప్రాసాశ్రమమున నివసించుచు బాదరాయణుడు ఏ పుణ్యనది తీరమున ఆగమ వ్యాకరణము, అష్టాదశ పురాణములు, రమ్యార్థమైన భారతమును రచించెనో అట్టి సరస్వతిని, సముద్ర సంగమమున కేగు గంగను, యమునను, నందను, విపాశను, వేత్రవతిని, రేవను, సరయువును, మలాపహారిణిని భీమరథిని, వృద్ధగంగను, కృష్ణను, కావేరిని, తుంగభద్రను, వేగవతి మొదలయిన యితర నదులను సేవించినాను. పుణ్యతీర్థములైన మూడు పుష్కరములను, ద్వారక, కాశి, అవంతి, మాయ, మధుర, కంచి, అయోధ్య అను మోక్షదాయకము లయిన సప్తపురములను సందర్శించినాను. సీతారామ లిఖితచిత్ర కూటమైన చిత్రకూటమును, పంచవటిని కాంచినాను."

ఇట్లు నారద మునీంద్రుడు తాను చూచిన పుణ్యక్షేత్రములను, దేవతామూర్తులను పేరు పేరు వరుసల పేరొనగా భృగుమహర్షి సంతసించి యిట్లడిగినాడు.

"మహాత్మా! ఈనాట యెన్నిది తిరుపతులను సేవించిన ఘటికాచలమును మీరక సూచించినావు. శ్రీహరి ఆ శైలమునకు ఏల వేంచేసెనో! ఆ గిరి రత్నము చరిత్రము వినవలయునని వేడుక కలుగుచున్నది. నాకోరిక తీర్చవా?"

నారదమహర్షి భృగుమహర్షి కోరిక విని సంతసించి నాడు.

"మునీశ్వరా; సరస్వతీ కాంతునికైనను సరస్వతీదేవి కైనను వేదముల కైనను శేషునికైనను ఆ శైలమును వర్ణించుట సాధ్యమగునా! ఇంక మావంటి వారిమాట యేమి చెప్పవచ్చును! ఇందిరా దేవిని గోవిందుడు అనతీయఁగా నేను ఆ పర్వత చరిత్రము వినాను. అది సకల పాపసంహార కారణము, మోక్షసంధాయకము, సంచితము మొదలయిన పాపము లనెడు సమిధలకు కార్చిచ్చు. విష్ణుమహిమ అను సువర్ణమును అరయు మచ్చు. సకల పురాణ సారాంశముల హెచ్చు. కైవల్య లక్ష్మిని ప్రీతి కలువవచ్చు. విష్ణుక్షేత్ర రత్నముల వెలదీర్చు బచ్చు (వర్తకుడు) శ్రీదేవి నివసించు మేలు మచ్చు. సాధు సమాగమ జ్ఞానవిద్యకు అచ్చు. వివిధ జన్మములను ధనము ను కొల్లగొట్టు ముచ్చు. బ్రహ్మాది సురలకు మెచ్చు. నవవిధభక్తి వెదకవచ్చు. పుణ్య

సౌధములకు పూలకుచ్చు. ఆ మహాచలము మహిమ యెంతన వచ్చు !

కనుక ఘటికాచల మాహాత్మ్యము పను ధన్యులకు విష్ణుభక్తి ఉదయించును. లక్ష్మీకటాక్షము కలుగును. పాతకము ను పలాయనము చేయించు ధర్మబుద్ధి ఒనఁగూడును.

రామనామము జపించి సంతోషపరవశులగు వారిని, విష్ణుకథా సుధారసము వీనులు అను దోసిళ్ళతోఁ గ్రోలు వారిని, పద్మానాథుని పాదపద్మములను అర్చించుటచేత కృతార్థములగు హస్తపద్మములు గలవారిని, తీర్థపాదుల పాదాబ్జ తీర్థములను సేవించి పావన శరీరులగువారిని, విష్ణు కీర్తనము గావించు వారిని దూరమునందే చూచి పరువెత్తు పాపులను యమకింకరులు దండింతురు. హరికథలు విననొల్లని పాపాత్ముఁడు ఈలోకమున ఉండఁగా నరకదోష దశకు నెఱచుచుండును. మరణించిన వెనుక నరకసముద్రమునందు శాశ్వతముగా మునిఁగి యుండును.

విష్ణుదేవాలయమునకు వెళ్ళఁ జాలని కాలు మరకాలు గాని కాలు గాదు. పురుషోత్తముని దివ్యరూపమును దర్శింపని అక్షి గవాక్షి కాని అక్షి కాదు. అచ్యుతుని చరిత్రమును ఆలకింపని చెవి రాట్నపు చెవి కాని చెవి కాదు. వైకుంఠుని కీర్తింపఁబూనని నాలుక కొండనాలుక కాని నాలుక కాదు. దానవారిని పూజించుటకు ముందునకు రాని కరము ఘోర

పాపకరము కాని కరము కాదు హరి పాద తీర్థమున తడి యని రూపము చిత్ర రూపమే కాని రూపము కాదు

తామస విదూరా ! (తమోగుణ చర్యకు దూరమైన వాడా !) విష్ణుభక్తులతో సాంగత్యము అబ్బిన ఋణము నందు సూర్యుని రాకచే వికసించు పద్మమువలె సజ్జనుని మనస్సు వికసించును.

సంగము అను నది ఎన్నోవిధముల విసర్జింపదగిన దైనను పెద్దలతో సహవాసము అను భాగ్యమును కలిగించు నట్టి విష్ణుభక్త సాంగత్యమును మాత్రము విడనాడరాదు. ఆ సంగము భక్తికి ప్రధానాంగమై శ్రీహరికి పరమాహ్లాదము కలిగించుటచేత ఇతర విధ సంగదోషములకు అన్నింటికి పర మౌషధమగును. విష్ణుభక్తి గలవారికి దానములు. జపములు, తపములు. బహువిధ ధర్మములు, సత్యము, వేదాధ్యయనము మొదలగునవి యెల్ల ఇట్టె వశపడును. నా జన్మాంతర సుకృతము చేత హరిభక్తి విశేషమునకు ఆకరమై నీదర్శనము ఒనగూడినది.

అనగా భృగుమునీంద్రుడిట్లన్నాడు.

"మానిచంద్రా ! నీవు ఎంత చెప్పినను ఇంకను వినవలె నని వేడుక కలుగుచున్నది. సాధు సంగము విష్ణు ప్రభావమును ఎట్టిదో నాకు సెలవిమ్ము ! నన్ను పవిత్రునిగావింపుము !"

అనఁగా నారదుఁ డిట్లు పలికినాఁడు.

"సరయూనది ఒడ్డున సూర్యవంశ ప్రభువులకు నివాస మయిన అయోధ్య అను పట్టణము గలదు. ఆ పట్టణ మందలి సౌధములు మణిమయములై తమ కాంతుల చేతనే శత్రు సైన్యములను అడ్డగించును. గంభీర మయిన కందకమును, ఉన్నత మయిన ప్రాకార కుడ్యములు గలిగి ఆ నగరము శత్రువులకు తేఱిచూడ రానిదై యుండును. దానిని ధవళాంగుఁడు అను రాజు పాలించు చుండును. నానారాజులు సామంతులై వచ్చి తమకిరీట రత్న కాంతుల చేత అతని పాద పద్మములకు నీరాజనము లిచ్చు చుందురు. ఆ రాజేంద్రుఁడు తన ఒక్క భుజముననే సకల భూభారమును వహించినాఁడు.

పరరాజులు ఎల్లరును ఆయుధములతోఁ బాటుయుద్ధము విడిచి కానుకలతో కరములు జోడించి దర్శించి సేవించు చుండఁగా పరాక్రమశాలి యైన అతఁడు ఒకనాఁడు నిండు కొలువు తీర్చియున్నాఁడు.

అంతలో అతని తలమీఁద మాణిక్య కిరీటము మాయమై పిట్ట యొకటి కుచ్చు వెలసినది. ముత్యాల సరములు పోయి ఱొమ్మునందు, మాంసపు పోచల దండలు నిండినవి. ఉంగరములను మ్రింగి జిగురుగండెలు చేతులందు తగులు కొన్నవి. జూఱువాపై కాణి సాలువను తోఁగించి జంతు చర్మము మొలకు చుట్టుకొన్నది. "అయ్యయ్యో! ఏమిది! ఉన్నట్లుండి యిట్టి వైపరీత్యమేల కలిగినది?" అని

సభాసదు లందఱును దుఃఖపడు చుండఁగా బంగారము వంటి శరీరము కాంతుక లేనిచుందునట్లు ఆ మహారాజు కిరాతుఁ డైనాఁడు.

అదియేమి ప్రారబ్ధమో! సదయ మయిన హృదయము అదయ మయినది. బందుగులను బంటులను విడనాడి అహేతు జంతు సంహారమే వినోదముగా ఎంచు కొన్నాఁడు. మునీశ్వరా! ఎవరి కయినను కాలము దాఁటరానిదికదా!

ఇట్లా రాజేంద్రుఁడు కిరాతుఁ డై ఎవ్వరిని పిలువక ఒక్కఁడే నానావిధ క్రూరమృగములు నిండియుండెడి మహారణ్యమునకు పోయి తిరుగుచు జంతువుల తలలు తఱుగుచు, చెట్లును పొదలును తీఁగలును నివాసస్థలములుగా అంగీకరించుచు ఒకనాడు వసిష్ఠ మహర్షి తపోవనమునకు అరిగినాఁడు.

ఆ మునిరాజు వానిని చూచి "ఇతఁడిచ్చటికేల వచ్చినాఁడు! ఇది నా ఆశ్రమ మని యెఱుఁగఁడా? ఏ మాత్రము భయపడక యీ కిరాత కీటము మాతపోవనములో ప్రవేశించునా?" అని అలిగియును అంతలోనే కోపమును అణచుకొని దివ్య దృష్టిచేత అతని వృత్తాంతము గ్రహించి కరుణార్ద్రచిత్తుఁ డై యిట్లు పలికినాఁడు.

"రాజా! ఒకనాఁడు నీవు వేఁట తమకమున మృగముల వెంట విశ్వామిత్రుని ఆశ్రమమునందు మృగములను

హింసించుచుండఁగా ఆ మునీశ్వరుఁడు శాపమిచ్చుటచేత ఈనాఁడిట్లయినావు సుమా! కానిమ్మా! ఇఁక విాఁదనీకు సీమ మగును లెమ్మా!"

ముని పలుకులు ముగిసినంతలో ధవళాంగునకు పూర్వపు రూపము అబ్బినది నరమాంసమే ఆహారముగా తిరుగుచు, విష్ణుద్వేషియై, అహంకారమునకు అవధి లేని ఘంటా కర్ణుఁడను దుష్టుఁడుకూడ శ్రీకృష్ణునిఁ జూచినంతలో నీచవ్యాపారములు మానినాఁడు గదా! సాధు సమాగమము చేత శుభము సమకూరుట విచిత్రమా!

అయ్యా! ఇన్ని మాటలు చేనికి? నాజనన కథ చెప్పుటయే యిందులకు తగిన సమాధానము కాఁగలదు."

అని తన కథ యిట్లు వినిపించినాఁడు.

2

నారద ముసీంద్రుఁడు భృగుముసీంద్రునకు ఈ విధముగా వినిపించినాఁడు.

హరి చక్రము అను పురవరము కలదు. అది శత్రు చక్రమునకు భేదింపరానిది అగుటచేత హరిచక్రమే అనఁదగి, చూడఁదగినది అగుట చేత సుదర్శనము అనఁదగి

యుండును ఆ పురమునందు గోవిందశర్మ అను బ్రాహ్మణుడు కలడు. అతడు వైష్ణవ ధర్మములు అమూలాగ్రముగా తెలిసినవాడై గోవిందునితో సమానుడు అని ప్రజల చేత కొనియాడబడెడివాడు. అతని సదాచారము. వినయము, విద్య, దయ మొదలగు సద్గుణములను ప్రజలు వేనోళ్ళ కొనియాడెడివారు. భద్రాంగి అను భద్రలక్షణశాలిని ఆతని యిల్లాలు. ఆ దంపతులకు నలుమొగముల వేలుపుతో సమానులయిన నలుగురు కుమారులు కలిగినారు. వారి వచనములు నాళీకములు (సత్యములు). వారిచేత అర్చలు గొను వేలుపు నాళీకోదరుడు. (ఉదరమునందు పద్మముగల విష్ణుదేవుడు.) వారు సుజన నయ నాళీకులు (సజ్జనుల కన్నులు తమపై నుండువారు.)

ఆ కుమారులు తండ్రి ఆజ్ఞను శిరసావహించెడివారు. అతడు తూర్పు తెలతెల వారకముందే లేచి నదికేగి స్నాన మొనరించెడివాడు. తెల్లని పట్టు బట్టలు ధరించెడివాడు. ఉచితమైన ఆసనమునుండి మనసులో సంపూర్ణము నిశ్చలము అయిన నిష్ఠతో గురుస్మరణము కావించెడివాడు. తిరు పవిత్రమును తిరుమణిని తిరుచూర్ణమును శరీరమున ధరించెడివాడు. భక్తితో సంధ్యావందనము మొదలగు విధులను నిర్వర్తించెడివాడు ఆర్ద్ర చిత్తముతో గీతలు (భగవద్గీతలు) పఠించెడివాడు. 'రూపముదాల్చిన వైష్ణవ ధర్మమేమో!' అని జనులెల్లరు మెచ్చుకొనునట్లు ఇంటికి వచ్చెడివాడు. అతని భార్యయైన భద్రాంగి ద్వారతోరణములు

ధరించి చేరవచ్చి పాదపద్మములు కడిగి, మిక్కిలి వేడుకతో ఆ తీర్థమును గ్రోలెడిది. చేతియందు తిరుమణి చెట్టి తొల్చి కైదండ యిచ్చి గృహములోనికి అతనిని తీసికొనిపచ్చెడిది. అంతలో కుమారులు పచ్చి నమస్కరించెడివారు. ఒకడు శ్రీ తులసిదళములు, ఒకడు పువ్వులు, ఒకడు చందనగంధము ఒకడు తీర్థము పూజాద్రవ్యములు కొని తెచ్చి యీయగా, ఆ విప్రోత్తముడు పూజాగృహము చేరెడివాడు. షోడశోపచారములతో అభువనాధి నాథుని పూజించెడివాడు.

పాలసముద్రపు కెరటములకణములచే ఎల్లప్పుడు తడియు చుండు వానికి జకము. బంగారు వలువ తాల్చు వానికి సన్న వలువలు. రాధ కుచము మీది కుంకుమాదులు సోకి యుండువానికి కాశ్మీర తిలకము. కౌస్తుభ భూషణముచేత శోభిల్లువానికి నవరత్న మయ భూషణములు. తపసుల హృదయము లనుపద్మములయందుండు స్వామికి అరవిరి విరిసరములు. రాక్షసు లనెడు చీకటులకు దీపమై దీపించునానికి దీపము. రమాదేవి అధరామృతము గ్రోలువానికి అమృత దివ్యాన్నములు. మహర్షుల సచ్చిదానందము అను మావి పూల గుత్తి అయిన దేవరకు పుష్పాంజలి, ప్రణయ కోపము పూనిన ఇందిరాదేవి పాదములకు మ్రొక్కుచు, గోపికల వలపు కొల్లగొట్టు వానికి వందనము. మాయాబాలుడై గోపకాంతలు ప్రేమతో చూచుచుండగా యశోదముందు ఆడు వాని మ్రోల నృత్యము.

ఆ జగన్నాథుని మొడలఁ గల భక్తివిశేషమును బట్టి భక్తులు ఉపచారములు చేయుటయేకాని ఆ ఉపచారముల వలన స్వామికి కలుగు సౌఖ్య మెట్టిది !

అరచేతిలో కొంచెముగా స్థలము తుడిచి, అగ్రము కలిగిన లేఁత అఱటి ఆకుల దొన్నె లుంచి. కొబ్బరి అన్నము లుంచి, ఆకులందు అభిఘారము కావించి, కంకణములు ఝుణ ఝుణ ధ్వనులు చేయు చుండఁగా, అందెలు ఘలు ఘల్లుమను చుండఁగా, బంగారు జరీ అంచుగల తెల్లని పట్టు చీర పెళ పెళ లాడు చుండఁగా. మెట్టెల చప్పుళ్ళు తాళ గతులను తలఁపించుచుండఁగా, కొందఱు కాంతలు ఆయా పదార్థములను పళ్ళెరములలో ఉంచి అందించు చుండఁగా భద్రాంగి ఎంతో తాలిమితో లక్ష్మీదేవివలె భర్తకు వడ్డించును.

ఏఱుగక ఒకదానితో ఒకటి పెనఁగొనెడు మెదుకులుగల వరి అన్నము, ఒలిచిన పప్పు, అప్పుడే వెన్న కాచిన నేయి, కారపు కూరలు, చారులు, శాకములు. అంబళ్ళు. పచ్చళ్ళు, ఆనవాలు, వరుగులు, అప్పడములు. వడియములు, తేనె పాకములు, సిగరలు, పాయసములు, కల వంటకములు, బజ్జలు, పిండివంటలు, చక్కెర జున్ను రసాయనములు, పాలు ఫలములు, ఎడనీళ్ళు, పానకములు, ఊరుఁబిండ్లు ఊరుఁ గాయలు, తైరు, సొంటి, మెత్తని లవణము, నిమ్మపండ్ల రస

ములు ఆమె వడ్డింపఁగా అతఁడు ఆపోశనముపట్టి తృప్తిగా ఆచమించి, తీర్థము గ్రోలి లేచును. స్వచ్ఛమైన జలముతో చేతులు కడుగు కొనును ఆచమించును. తులసిదేకులు సేవించును. బంగారు వన్నె కల తిన్నెమీఁద విశ్రమించును. తనతోఁబాటు భుజించిన అతిథులకు అండఅకు పక్కలు, పచ్చకర్పూరము. తెలనాకులు ఒసఁగును.

అంతఁ పిమ్మట ఆభక్తాగ్రేసరుఁడు అతిథులను వీడ్కొలిపి, పరమ భక్తితో బాలరామాయణము పఠించును. తెలనాకులతో పచ్చకర్పూరపు బాగములు భార్య అందించుచుండఁగా తాంబూలము సేవించి శ్రీహరికథలు వినుచుండును.

ఆ గృహమునందు తరళ అను కాంత కలదు. ఆమె ఆదంపతులకు భక్తితో పరిచర్యలు చేయుచుండును. పరిచారికయే అయినను తన నడవడిచేత అందఱి మన్ననలకును పాత్రురాలై యుండును. వేఁకువయందే లేచి శ్రీహరికీర్తనము చేయుచు వాఁకిలి ముంగిళ్ళు తుడుచును. గోమయము కలిపిన కలయంపి చల్లును. అయిదు రంగుల ముగ్గులు పెట్టును. ఇట్టి పరిచారిక లేదని ఇంటివారును, ఇంతటి నిపుణురాలు లేదని ఇరుగు పొరుగిండ్ల వారును ఆమెను ఎంతో మెచ్చెడివారు. వాఁకిటికి వచ్చెడి యిల్లాండ్రను సవినయముగా పలుకరించును. సాధుజనులకు నమస్కరించును, ఎల్లప్పుడును ప్రసన్నముఖియై ఆమె 'అయ్యా!' అని యజమానుని, 'అమ్మా!' అని యజమాను రాలిని

చనవుగా సంబోధించి సేవించును. స్వామి నిర్మాల్యము కొప్పునందు పూని పాపములను పటాపంచలు చేయును. భక్తులు భుజింపఁగా మిగిలిన అన్నముచేత ఆఁకటి చిచ్చు చల్లార్చుకొనును. ఏనాఁడును మనస్సులో చింతకు చోటీ యదు.

ఇట్లు తరిళ ఆ మహాభక్తుని గృహమున పరిచారికగా భాగవత సేవ చేయుచుండుట వలన పురాకృత పాపములను నశింప జేసి కొన్నది. ఎంతో పుణ్యము అర్జించుకొన్నది.

గోవిందశర్మ నివాసమునకు సమీపముననే హరి శర్మ అను విప్రవరుఁడు కలఁడు అతఁడు కర్ణునివలె ఉదా రుఁడు. మన్మథునివలె సుందరుఁడు. చంద్రునివలె సుప్ర సన్నుఁడు. నాగరాజువలె భాషా చతురుఁడు. మిక్కిలి సర సుఁడు. 'గుట్టముగా రాచిలుక, జెక్కెముగా మీనము, రథముగా మలయానిలము శరములుగా అరవిరి మొగ్గలు. ఫిల్లుగా చిగురల్లికల చెఱకుకట్టి, పూదేనె నూనెతో మెఱుఁగు మీఱు కత్తిగా తమ్మిపూవమ్మ చికిలిచేసిన బాకు లుగా నల్లకలువ ఱేకులు లేకపోయిన నేమి? ఇతఁడు యువ తీజన మన్మథుఁడు కదా!' అని జనులు మెచ్చునట్లు అతఁడు నిండు జవ్వనమునందు మిక్కిలి చెలువముతో మెఱసినాఁడు.

అతని తలపెనుక నునుపుగా దువ్వి వైచిన శిఖా బంధము అందముగా ప్రేలుచుండును. మేలిమి పసిఁడి పోగుల వన్నెలు మెఱుఁగు చెక్కిళ్ళను తాఁకి వెల వెలఁ బోవు

చుండును. తెల్లని జన్నిదముల తేటలు తెలిపట్టు పైవలువ వన్నెతో హత్తుకొని యుండును. నుదుటి మీఁద వెలిదమ్మి మొగులను పరిహసించు ఊర్ధ్వపుండ్రములు మురుపు చూపు చుండును. సన్నని నీరుకావి దోవతి చెఱఁగు కొనగోళ్ళ మెఱుఁగు లను సిరికి ఆచ్ఛాదనముగా అలరారుచుండును. జవ్వనపు కలిమి నిండిన మేని మెఱుఁగులు సువర్ణ చూర్ణ మును వెదచల్లు చున్నట్లుండును. ఇంతచక్కనివాఁ డైనను ఇంతసరసుఁ డైనను అతఁడు ఆ పురములో విటులను వలలో వైచుకొను కలికి చూపులు గల కాంతలను తలయెత్తి చూడ నైన చూచెడివాఁడు కాఁడు! కాని అది యేమి చిత్రమో! తారను చూచిన అతని చిత్తము తరళ తరళమై తత్తఱించి నది. వైదిక నిష్ఠాగరిష్ఠుఁడై యున్నను ఆ చెలిచెలువమును మఱవలేక అతఁడు మనసవికారమునకు లోనైనాఁడు. అతని హృదయము అంతకంతకు తరళాత్మయము కాసాఁగినది. తార అను శబ్దము విన్నచో అతని మనస్సు నాగస్వరము విన్న నాగరాజువలె లేచును. చంద్రికకై చకోరములువలె కన్నులు అన్ని దిక్కులను ఆమెకై వెదకును. ఆకన్నులు ఆ చిఱునవ్వులు ఆ మెత్తని పలుకులు కనుచు వినుచు అతఁడు నిలువున పులకించును. అంత చక్కఁదనము మానవకాంతకు ఎట్లు కలిగెనో అని ఆశ్చర్యపడును తానై పలుకరించినచో తిరస్కరించునేమో అని భయపడును. కాలయాపనము సహింపలేక తత్తఱించును. ఎంత ప్రయత్నము చేసినను ఆమె మీఁది అనురాగమును అణఁచుకొనలేక నిట్టూర్పులు విడ చును. అద్దము ముందు నిలఁబడి సిగదువ్వును, ముడివైచును,

మఱల దువ్వును. రెండుచేతులు మీఁది కెత్తి నిగ్గును. నీలుగును. ఆవులించును. కొనగోళ్ళతో సన్నలు చేయును. మీఁదఁబడఁ దలఁచును. చెమర్చుచు ఏమేమో భావించును. ఎలుగెత్తి పలుకఁ బోవును. జన్నిదములు సమముగా పట్టి ప్రేళ్ళసందున దువ్వును. భ్రాంతికి లోనై తన వెదవి తానే చిమచిమలాడునట్లు నొక్కుకొనును. ఆమె కనఁబడినంతనే ప్రేముక్కును.

తరళ అతని చేష్టలను చూచినది. వానికి కారణము గ్రహించినది. "నాకోసమే యింత వలపు!" అని ఆశ్చర్య పడినది. "తనపై అతనికి అంత మక్కువ కలుగుట తన అదృష్టమే." అనుకొని మురిసినది. అతని అందము చందము ఎంచిఎంచి వలపునకు లోఁబడినది. "అయ్యగారంత చింత పడుచుండఁగా ఉపేక్షించుట ధర్మముకాదు." అనుకొన్నది. చాటుమాటుల దగ్గఱకుచేరి లాలింపవలె ననుకొన్నది. తన మనసు ఎఱుకపఱిచుటకు ఉపాయములు ఎన్నుకొన్నది. అపుడు ఆమె చేష్టలలో క్రొత్త చందములు పుట్టినది.

అతఁడు చూచునట్లు ఆమె వెండికడియములు మినుకు మినుక్కనునట్లు తల మాటిమాటికి దువ్వి కొప్పు పెట్టుకొనును. గబ్బిగుబ్బలు బయలుపడునట్లు సారెసారెకు పైఁట చెఱఁగు జాడించి సవరించును. పలువరుస మిఱియునట్లు చిఱునవ్వుతో తళుకు టద్దము చూచుచు అందముగా నాభి దిద్దును. లేనిపని కల్పించుకొని ఏటవాలుగా వాలుఁగన్నులలో గర్వము అతిశయించునట్లు చూచును. సాయంకాలపు

వేళ ముద్దు ముద్దుగా ప్రొద్దువన్నె పలువ లుకట్టి, చిన్నారి పొన్నారి పూఁతనగలు పెట్టి, మట్టెలు ప్రోఁగునట్లు అలిని ముందు సంచరించుచుండును.

ఇట్లు ఇద్దఱును ఒకరి హృదయము లొకరు తెలిసికొ న్నారు. అనుకూలమయిన సమయము, తావు లభించుట కొఱకు ఉపాయములు ఆలోచించినారు. ఆ ఉపాయములు ఫలించుటకు అటంకములు కలుగుచుండఁగా తాళ లేకపోయి నారు. వలపుజబ్బు పెరుఁగఁగా ఆ బ్రాహ్మణుఁడు తన విద్యను, కులమును, శీలమును, పెద్దఱికమును విడచిపెట్టి నాఁడు. ఆమె పెద్దల అనుమతి, ఇల్లు, వాకిలి, నీతులు తలఁ పని దయినది. ఇంకేమున్నది? ఇద్దఱును రహస్య సమాగమ ములు ప్రారంభించినారు. వానికి ఫలముగా నేను జన్మించి నాను.

మాఅమ్మ నన్ను చాల గారాబముగా పెంచినది. నాలుగైదేండ్లు వచ్చుదాఁక నాకు కష్ట మన్నది తెలియదు. అంతలో సూర్యుని కిరణముల వేఁడిమికి వడ దాఁకిన ఆకాశ లక్ష్మి శరీరమున కూర్పఁగా వాడిన తామరాకులువలె మొబ్బులు దట్టము లయినవి. "ఇంతకాలము సహించినాను. ఇఁకనైనను పుచ్చుకొన్న అప్పు ఇచ్చి పొమ్మని దేవేంద్రుఁడు సూర్యునిచుట్టు గీచిన గీఁతయో అనునట్లు సూర్యమండలము చుట్టును వఱదగుడి కట్టినది. నెమిళ్ళను ఆడించుటకు తో ల కరి అను నాట్యగురువు ఎత్తిన పసిడి బెత్తమేమో అనునట్లు ఈశాన్యదిక్కున తీఁగ మెఱుపు కళుక్కుమన్నది.

కాలము అను వీరుఁడు వేసఁగి అను శత్రువును పాఱఁ ద్రోలుటకు చేయు సింహనాదమేమో అనునట్లు, విద్యో గుల గుండెలు ఘక్కున పగులఁ గొట్టుచు మేఘము దిక్కులు ఘూర్ణిల్లునట్లు ఘుమఘుమ ఉఱిమినది.

ఔరా! తనవారిని (తన నీటిని) ఎదుకొను చాతక గణములను మేఘుఁడు తొళ్ళితో రువ్వెనో అనునట్లు ఆకాశలక్ష్మి భూదేవిని పూజించు పుష్పాలో అన్నట్లు వడ గండ్లు జలజల రాలినవి.

"నక్షత్రమార్గము అను మట్టినుండి మిక్కిలి విస్తార ముగా దిగిన ఊడ లివి." అనునట్లు మేఘములు దట్టముగా క్రమ్మికొని సముద్రములు పొంగునట్లు వానలు కురిసినవి.

ఆ సమయమున కౌండిన్యుఁడు అనుముని శిష్యసమే తుఁడై తీర్థయాత్రలు చేయుచు ఘనరాక్షసుల పాలిటి విష్ణు చక్రమైన ఆ హరిచక్రమునకు వచ్చినాఁడు. గోవిందశర్మ ఆవార్త విని కౌండిన్యునకు ఎదురేఁగి ఇంటికి రమ్మని ఆహ్వా నించి కొనివచ్చి పుత్త్రులతో భార్యతో అర్ఘ్యపాద్యములిచ్చి సాష్టాంగ నమస్కార మొనర్చి "దేవా! ఘోరమైన పాప సముద్రమును దాఁటలేకున్న నా కు తెప్ప చిక్కినది. పుణ్యా శ్రమ మయినాను. మంగళములు సంప్రాప్తించినవి. కుటీరము పావన మయినది. కోరికలు ఫలించినవి." అని అమృతరస రూపములయిన భోజనములతో తృప్తి కలిగించినాఁడు. అటు పిమ్మట " మహాత్మా! ఇది వానకాలము. సంచార

యోగ్యము కాదు. ఈ రెన్నెల్లపాటు ఇచ్చటనే ఉండుఁడు! దాసుఁడ నయిన నాయీ కోరిక చెల్లింపుఁడు!" అని ప్రార్థించినాఁడు. మహర్షి అతని ప్రార్థన మన్నించి కొంతకాలము అచ్చట ఉండి అతనికి వైష్ణవాగమ కథామర్మములు ఎఱిఁగించుచు కాలము గడపినాఁడు.

భృగుమునీంద్రా! అప్పుడు నేను బాలుఁడ నయినను నా భాగ్యమువలన ఆ పుణ్యకథాలాపములయందు మిక్కిలి ఆసక్తి కలిగినది. ఆమహాత్ములు నన్ను మిక్కిలి దయతో చూచి నా ముంగురులు దువ్వుచు, చెక్కిళ్ళు నిమిరి ముద్దు పెట్టుకొనుచు ఆదరించెడివారే కాని దూరముగా పొమ్మన్న వారు కారు. వారే నాకు నుదుట తిరుమణి దిద్దెడివారు. నాకు వారికడ ఉండఁగా తల్లియొద్దకు పోవలె ననిపించెడిది కాదు. ఆకఁటి దప్పులు తోఁచెడివికావు. వారితోడిదే లోకముగా ఉండెడివాఁడను. కొండిన్య మునీంద్రునకు నాపైఁగల ప్రేమ యెటుపంటిదో! నన్ను శఁఖ చక్రాంకితునిఁ గావించి మంత్రోపదేశముచే ఉద్ధరించినాఁడామహనీయుఁడు.

అట్లు కొన్నాళ్ళు ఆబ్రాహ్మణోత్తమునకు నానా వైష్ణవాగమ రహస్యములు ఎఱిఁగించిన పిమ్మట ఆమహర్షి అచ్చటినుండి యథేచ్ఛగా అరిగినాఁడు. తదుపరి కొంత కాలమునకు జనని స్వర్గస్థురాలు కాఁగా నేను గోవిందశర్మకు మ్రొక్కి 'దేవా! మీసేవ చేయుటవలన నాకు కొంచెము వివేకము కలిగినది. తపము చేయఁబోయెదను. నాకు అనుమతి దయచేయుఁడు!" అని అతని అనుమతి పొంది అప్పుడే

బయలుదేఱి కొన్నిదినములకు పర్వతకులమున పవిత్రమయిన ఘటికాచలమును చేరుకొన్నాను. మనసును నిగ్రహించుకొని చలికిఁగాని, యెండకుఁగాని, వానకుఁగాని జంకక తపము చేసినాను. అంతట గరుడవాహనుఁడై లక్ష్మీరమణుఁడు సాక్షాత్కరించినాఁడు. స్వామి నల్లనిమేన మెఱుపులు ధగధగలాడుచున్నదిబంగారువలువ. రెండుచేతులయందు శంఖచక్రములు తళతళలాడుచున్నవి. కన్నులు రెండును సూర్యచంద్రులుగా కాన్పించుచున్నవి. ఱొమ్మున శ్రీదేవి కొలువు చేసి యున్నది. హారములు, కిరీటము, నూపురములు, భుజకీర్తులు రత్నఖచితములయి దిశలను వెలిఁగించుచున్నవి. కాని, యేమి చెప్పను మునీంద్రా! మిఱుమిట్లుకొన్న కన్నులను నేను నులుముకొని చూచునప్పటికి అదృశ్యుఁడయినాఁడు భగవంతుఁడు. నే నందులకు చింతించి యెంత ఘోరతప మయినను చేసి తనివి దీఱునట్లు చూడవలె నని మఱల తపస్సు ప్రారంభించినాను. అప్పుడు ఆకాశవాణి ఇట్లు వినిపించినది.

"బాలకా! నీవు ఎంత తపము చేసినను ఈజన్మమునందు ఇంతకంటె ఎక్కువ శుభములు కలుగుట అరుదు. మఱియొక జన్మమునందు నీ సంకల్పము సిద్ధించును."

ఆ పలుకులు విని "పునర్జన్మము ఎన్నఁడు కలుగునో, అంతవఱకు ఏల కాలము వ్యర్థముగాఁ గడవలెను!" అని

తలంచి యోగపద్ధతిని శరీరము విడిచి పరమేష్ఠికి కుమారుడ
నై ఈ శరీరము ధరించినాను. సజ్జన సాంగత్యముపలన
ఇటువంటి మహత్త్వము కలుగునని యెవ రూహింపఁగలరు?"

అంతట భృగుమహర్షి యిట్లడిగినాఁడు.

"మహాత్మా! జనులకు కొంగు బంగారము, విద్యా
మూలము అగు చక్కని కథ వినిపించినారు. మఱి శ్రుతికా
చల మాహాత్మ్యము సెలవిచ్చి మాకు వీనుల విందు గావిం
పుఁడు!"

నారద మునీంద్రుఁడు అప్పు డా మహర్షికి ఈ విధ
ముగా చెప్పినాఁడు.

"పరమాణు గణముల సంఖ్యను ఎన్నవచ్చును. కాని
శ్రుతుల కల్యాణదాయకము. హరిభక్తి సంధాయకము అగు
శ్రుతికాచల మాహాత్మ్యమును గణించుట యెవరి కయినను
సాధ్యము కాదు. నాకు తెలిసినంత చెప్పెదను. వినుము!
ఆది చాక్షుష మన్వంతరము ముగియు నప్పుడు సప్త సముద్ర
ములు ఒక్కటి కాఁగా ఎచ్చటను భూమి కనఁబడలేదు.
శ్రీహరి సప్త మహర్షులను ఆ మనువును రక్షింపఁబూని ఒక
కొమ్ముగల మత్స్యము రూపము ధరించినాఁడు. సమస్తమును
భూరూపమయిన ఓడలో చేర్పించినాడు. వాసుకితో ఆ
ఓడను అంటఁ గట్టినాఁడు. అది యే కొండ శిఖరము నందలి
పుట్టలోనో పెట్టను బోలియుండు తేనె పిరవలె ఒప్పినది.

తరువాత భక్త రక్షణ దక్షుఁడయిన పద్మలోచనుఁడు గగన గంగ నీటి తుంపురులు దిక్కాంతలు చల్లెడు తేల్లని మొల్ల మొగ్గలో అనునట్లు ఒప్పుమీఱు శత శృంగ పర్వతమునకు నాకను చేర్చినాఁడు. ఆ పర్వతమునందు కవి నుత జీవనము (కవులచేత కొనియాడఁ బడిన బ్రబుకు. నీటి పక్షులచేత కొనియాడఁ బడిన నీరు) కలిగి సరసులు (చెఱువులు) సరసులవలె (రసికులవలె) అలరారుచుండును. నాగ గరుడ విద్యాధర కాంతలు హరికీర్తనము గావించుచుందురు. అచ్చటి తొళ్ళు వెలకట్టరానిమాణిక్యములనుధరించి, పునుఁగు కస్తూరి, కర్పూరము, జవాది పూసి, హిమజలమునందు (మంచునీటియందు, పన్నీటియందు) మునిఁగి తేలుచు రాజులో అన్నట్లు రాణ మీరుచుండును. అక్కడి కొండ శిఖి మెడ యెత్తినచో అందునట్లుండు చంద్రునిలోని లేడికి తన నోటిలోని పచ్చిక అందింపఁ జూచును. బంధుభావమనఁగా అట్టిదికదా! అచ్చటనే, ఎంతో శాంతి నవలంబించి మహా తపస్సు చేసి అర్జునుఁడు తన్ను పరీక్షింప వచ్చిన ఫాలాక్షునితో పోరాడి పాశుపతము సంపాదించినాఁడు.

అట్టి శతశృంగ పర్వతము నందుఁగల ఒక సరస్సు చెంత మన్వాదులు వసతి కల్పించుకొన్నారు. ఆ సరస్సు నందు నిండియున్న తామరల నుండియు కలువల నుండియు స్రవించు తేనెవాఁకల చేత జలము అంతకంతకు అధిక మగుచుండును. పక్షిశతములు అటునిటు సంచరించుచుండఁగా వాని రెక్కల కదలికలవలన పుట్టు గాలుల చేత

ఎగురుచుండు పుప్పొళ్ళచేత గట్టులు మిక్కిలి కమ్మని తావితో నిండియుండును. ఎంతో ఎత్తుగా పొంగి పడుచుండు అలల మ్రోఁతలు కొంచెమయినను విరామ మెరుఁగకుఁడును. తామర తూండ్లను పట్టి ముక్కులతో చీల్చి భక్షించుటకై మరాళములు సారసములు మొదలగు విహంగములు తిరుగాడుచుండును. ఆ రమణీయ స్థలమునందు వసించి వారు కుక్కుటాసనము మొదలుగాఁగల ఆసనములందుండి, మనస్సును నిగ్రహించుకొని, ఏకాక్షర ప్రాణాయామాసక్తులయి ఇంద్రియములను వశపఱచుకొన్నారు. కాంచనమును కాచమును ఒకటిగా చూచుచు, మమకారమును కోసివైచి, ధారణలను సర్వార్థ సాధకములుగాఁ జేసికొని కామగతిని కట్టిపెట్టినారు. ఇందిరా సుందరీ మనోహరుఁ డయిన హరిని హృదయమునందు పొందుపఱచుకొన్నారు. వారు భావించుకొన్న ఆ దివ్యమూర్తి అడుఁగులు భక్తజనుల తాపత్రయమును పాపచయమును అడుఁగునఁ బడఁజేయునవి. జంఘలు చిక్కని వెలుఁగులచేత భూమిని ఆకాశమును ఆవరించునవి. ఊరువులు పసిఁడి అఱఁటుల పన్నెలను ప్రవహింపఁజేయునవి. నితంబము రత్నములు పొదిగిన బంగారు మొలనూలు గలిగి పర్వత నితంబమును తలఁపించునది. నాభి కమలగర్భుని జన్మమునకు కారణమైన కమలమునకు పోలికయైనది. సురలు గరుడులు, మొదలగు ఖేచరులు విహరించు గగనమునకు సమానమైనది మధ్యము. వైజయంతి, శ్రీవత్సము, కౌస్తుభము, శ్రీదేవి కానవచ్చునది వక్షము. గర్వాంధు లయిన రక్కసులను చీల్చుటచేత

వినోదకరము లగునవి కరములు. భక్తజనరక్షణమునకు అభిముఖ మైయున్నది ముఖము. తియ్యదనము తఱుగని లేత మామిడి చిగురును అధరముగా జేయునది అధరము. బంగారు నాగలి చక్కదనమునకు తానకమైనది నాసిక. పద్మలక్ష్మికి ఒకవింత చెలువము చూపునవి కన్నులు. చంద్ర ఖండములను చెక్కివై చునవి చెక్కిళ్ళు. లేత మొగలి పూవులోని దళమునకు చుట్ట మయినది నుమురు. మెఱుగులు చిమ్మి రత్నములు చెక్కిన కిరీటముతో రంగుమీఱు నది మస్తకము ఇట్టి దివ్యమూర్తిని ఆత్మలందు అవలోకించు చు చంచల బుద్ధి కాని అలసట కాని లేకుండ తపము చేయి చున్నారు మునులు.

ఆ సమయమున వైజయంతమునందు కొలువు తీర్చి నాడు దేవేంద్రుడు. అందుగల కంబములు మంకెనపూవన్నెతో జగడములాడు పగడములతో చెక్కబడినవి. వాని మీద వికసించు పద్మములవంటి కెంపుల పువ్వులున్నవి. పచ్చల బోదెలలో రాలిపడిన ఊదు వత్తులపొడి రత్న దీపములనుండి కొడి రాలిపడినదేమో అనుభమను కలిగించు చున్నది. రేజోతి ఛాతిసోడ జాజుటాకును అవలంబించి యుండు బంగారు వన్నెతీగల చిత్రములును, మేలిమి బంగారపుతేకులు గలిగి చలించు తెఱ, మాణిక్య ప్రపంచమున వింత మెఱుగులు ఈను చున్నవి.

ఇట్టి కొలువు కూటమునందు వేల్పులతో ముచ్చటించుచున్న అమరేశ్వరుని సన్నిధికి ఒకచారుడు చెమటలు

ప్రగక్కున వచ్చి పడవడ వణఁచుచు నిలిచినాఁడు. అతని దీనత గమనించి కిన్నరీ చారణులు గానములు చాలించినారు. అప్పు డతఁడు ప్రభువునకు నమస్కరించి భయపడుచు ఈ విధముగా నివేదించినాఁడు.

"దేవా! మీ ఆనతి చొప్పున నేను భూలోకమునకు పోయి అందు ఒక వింత చూచి వచ్చినాను. దానిని స్వామి సన్నిధానమున తెలుపుటకు భయ మగు చున్నది.

త్రిలోకనాథా! ఇప్పటి వటుకును ఏలిన వారికి ప్రియ మగునట్లు మెలఁగు చుండు భరద్వాజుఁడు, కశ్యపుఁడు, గౌతముఁడు, అత్రి, కౌశికుఁడు. జమదగ్ని, వసిష్ఠుఁడు, పరమ పతివ్రత యైన అరుంధతీదేవితోఁగూడ శతకూట పర్వతము మీఁద భయంకర తపస్సు చేయుచున్నారు. వారు తపసునది స్వర్గమో, సత్యలోకమో, కైలాసమో, వైకుంఠమో తెలియకున్నది. చూచినది చూచినట్లు విన్నది విన్నట్లు మఱుఁగు పెట్టక, వెఱవక, మఱపు లేక కార్యమును విన్న వించుట వేగరుల ధర్మము. కావున ఇట్లు విన్నపము చేసి నాను ఇది దేవర పరాకు చేయఁదగిన విషయము కాదు."

దారుని పలుకులు వినఁగానే ఇంద్రుని గుండె జల్లు మన్నది. 'నీవు వెళ్ళి రంభను పిలుచుకొనిరమ్ము!' అని ఒక భృత్యుని పంపినాఁడు. వాఁడు అతివేగముగా ఆ సుందరి గృహమునకు వెళ్ళి సురపతి ఆజ్ఞ వినిపించినాఁడు. అంతట ఆ ఒయ్యారి చల్లని పన్నీట జలకమాడినది. చెంగావి పావడ

మీఁద తెల్లని పట్టు చీర గట్టినది. కర్పూరపు తిలకము దిద్ది నది. కమ్మఁదావులు చిమ్ము మందార దామములు తలలో పెట్టుకొన్నది. చందనము పూఁత జవ్వాది కూర్చి ఱెప్ప లకు జిలిబిలి రేక తీర్చినది. వెన్నెలల పంట వంటి హారములు గబ్బిగుబ్బలమీఁద సొగసుగా అమర్చుకొన్నది. తొలకరి మెఱపుదలె ఇల్లు వెడలినది.

అప్పుడు మదనుఁడు ఆనందముతో కూనరాగములు తీయు విధమున ఆమె నూపురములు మధురముగా ధ్వనింప సాఁగినవి. బంగారపు అఱఁటి బోదెలవంటి తొడలు ఏనుఁగు తొండముల గర్వమును వదలింప బూనినట్లు విలాసములు వెదచల్లినవి. మంజీరములందలి పద్మరాగమణులు మార్గము నకు రాగరసము నింపినవి. మట్టెలు ఘల్లుఘల్లుమని తాళ గతులతో మ్రోఁగినవి. ఇది చిలుకయో! చిలుక గుఱ్ఱపు కాతు దేవి ధరించు ముత్యాల హారమో! దేవేంద్రుని జయ విహారమో! పూర్ణిమ చంద్రుని కాంతిసారమో! మెఱపు తీఁగల సారమో!' అని ప్రేక్షకులు మెచ్చునట్లు హంసనడక లతో దేవేంద్రుని సన్నిధికి వచ్చినది.

అట్లు వచ్చిన రంభను చూడఁగానే సభాసదు లంద ఱును మన్మథ బాణ పీడితులై ఆమె సౌందర్యము నిట్లు ప్రశంసించినారు.

"ఇంద్రనీలముల సొంపులు నింపుకొన్నవి కురులు. నెలవంకకు వంక లెన్నునది నెన్నుదురు. రేక చీఁకటిమూఁకను

సాఁకునవి కనుబొమలు. కలువలను వలపించు నవి కన్నులు, సంపెంగ విరి నెత్తావిచే ఆసగలిగించునది నాసిక. మొఱుగు మాటెడు చెక్కిళ్ళ ముద్దుగొలుపు చున్నవి. తేనె బాపి దీపి మోవి. మొల్లమొగ్గల చాలు పలువరుస. మన్మథుని ముఱి వెపు శంఖము కంఠము. పూల తీఁగలను గెలుచునవి చేతులు. పసిఁడి గిండ్లను గదుమునవి పాలిండ్లు. ఆకాశమునకు దగ్గఱి చుట్టము లేఁత నడుము.

యువకుల మనస్సు లనెడు చేఁపలను పట్టుటకు పూను కొన్న మరునిచేతి గాలపు చివ్వయో, జంట తప్పని నల్లని చీమల బారో అనునట్లు మాఱునది దీని నూఁగారు.

ఈ చక్రవర్తిని నితంబ చక్రమునకు వెలిచి చక్రము భ్రమకు లోనైనది. చక్రము పలుతునుక లయినది. ముత్యము లతో చుక్కలతో ఈడు జోడై సొంపెక్కినవి ఈ కొమ్మ పాదనఖములు.

ఈ వనిత కర్ణములు శ్రీ వైభవము వహించుటచేత వానికి విలాసదర్పణమ్ములై ముద్దు చెక్కులు అందము పొంది నవి. కానిచో ఇట్టి చెలువము ఎచ్చటనైన కలదా?

ఈ మగువ మొగము అబ్జ మహిమ (పద్మపు గొప్ప తనము – చంద్రుని గొప్పతనము)తో ప్రకాశించును. కన్నులు రాజీవశోభ (పద్మ వికాసము) వహించును. చూపులు కాండ జాతము (పద్మము, బాణ సమూహము)

విలాసము చూపును. కంఠము జలజమంగా (శంఖముగా) ఖ్యాతి వహించును. స్తనములు ఉత్పల కోరకములను (కలువ మొగ్గలను) తలదించును. నాభి సారసము (పద్మము) చక్కదనము సంతరించుకొనును. నడుము పుపక్కరపు (ఆకాశము) మెఱుగుతో అతిశయించును. పాదములు వనజ పల్లవత్వము (తామర చిగురాకుల తత్త్వము)తో మించును. ఆహాహా! ఈ పద్మగంధి నిలువంతయును సువర్ణ కమల సౌభాగ్యము కాంచును. ఈ మోహనాంగి పచ్చపిలు కాని చిలుక దొరసాని కాని సామాన్య కాంతయా!

ఈ రమణి పొక్కిలికి సాటి రాదలచి సరస్సు భంగము (అల-వినాశము) పొందకుండునెట్లు? ముంగురుల రంగును మించదలచి చీకటి గొందులలో అణగ కుండునెట్లు? కెమ్మోవితో పోరదలచి అమృతసారము పలుచనై వెలవెల బాఱకుండునట యెట్లు? చూపులతో సరిపోలదలచి బాణములు చులుకనై వ్రాలకుండునెట్లు? ఎల్ల విధముల వర్ణింపదగిన చక్కదనముగల యీకాంత అవయవములతో ఎంచి చూచినచో ఎందైనను సాటి కలదా!

మెఱుగులు చిమ్మెడు చిగురు మోవి కల కర్పూర పు ద్రోవి, కస్తూరి నెత్తావి, మోహ సముద్రపు నావ, ముత్యాలలోవ, మోహినీమూర్తి చేవ, వలపుల తరితీపు, చంద్రకళ ప్రాపు, వలరాజు ఆటవ తూపు, పసిడి శలాక,

జవ్వనము అట్టాక, ప్రకొమ్మించు శోక, రతనాల తేట, బంగారుమూట, సరస్వతి చేతి చిలుక, మవ్వపు మొలక, చేమంతి బంతి, జక్కవ చంటి అయిన ఈ కలువకంటి ఎంతుని పట్టపు దంతి.

నిలుకడ నేర్చిన మెఱుపులోని ఒఱపు చిత్తరము లోని తరము, మేలిమి బంగారపు మిసిమిలోని మిసిమి, సంపంగి విరి తావిలోని తావి, మన్మథునిచేతి కిరుసులోని బిరుసు, చిత్తరువు పసిండి ప్రాత హరువులోని మురువు, ప్రాదీపలోని చేవ, ముత్యాల సరము కళుకులోని బెళుకు, పద్మరాగ మణులలోని రంగుతో కూర్చి మూడు లోకములను మోహింపఁజేయు శృంగార రసముతో కరువు గట్టి మన్మథ ప్రబ్రహ్మ ఈ సుదతిని సృష్టించినాఁడు కాఁబోలును! కానియెడల ఈ కాంతకు ఈ విలాస మెట్లు కలుగును?

ఈ చెలుప కలువకటారి కాదు. సంపెఁగ తూఁపు కాదు మేలి కళుకుల తమి తమ్మి కాదు. క్రొత్త చిగురు కాదు. మొఱఁగు పైపు మొగలి చిక్కటారు కాదు. విరివింటి వానికి బిక్కిలి ప్రియమైన మోహన బాణము మాత్రమే. తన నడకల అందము చేతనే దేవలోక గజగమనల విలాసమును గెలుచు ననియు, ఒఱపు చూపులచేతనే భూలోక మందలి హరిణనేత్రల విభ్రమమును తలుము ననియును, ఇంపైన నడచేతనే పాతాళ నాగకాంతల శరీర విలాసమును జయించు ననియును, కలికి పలుకులచేతనే ఎల్లగుక వాణుల విలాసమును గదుము ననియును కదా మన్మథుఁడు వాలు

చూపులనేడు బేడిసమెఱుఁగుల పేర మూడు లోకములందలి సుందరీ మణుల రూపవైభవమును తిరస్కరించు బిరుద మిచ్చినాము.

ఈ కాంతను కాంచినచో మన్మథ తాపము పొంద కుండ నిలువఁగలుగుట బ్రహ్మకైనను సాధ్యమా!"

ఇట్లు దేవతలు తలపోయు చుండఁగా దేవేంద్రుఁడు రంభను చూచి యిట్లు పలికినాఁడు.

"ఘన కుచ కుంభా! రంభా! ఒక కార్యము నా చేతిలోని నిశిత వజ్రము ధారకును అసాధ్యముగా నున్నది. కనుక నిన్ను పిలిపించినాను. వసిష్ఠుఁడు మొదలైన మునులు శతకూటపర్వతమునందు లోకములను తపింపఁ జేయు తపోగ్ని జ్వాలలతో తేజరిల్లుచూడఁ రాకున్నారు. వారిని ఏడుగురిని నీవు వలరాచవారిబారివారిని (మన్మథునికి లోఁబడినవారిని) కావించి, గర్వపర్వతమును తుంచి వచ్చినప్పుడే మెచ్చి నీకు వలసిన బహుమానము లీయఁగలము. ఇప్పుడే ఈ కార్యమునకు పూనుకొనుము!"

దేవేంద్రుని పలుకులకు రంభ యిట్లన్నది.

"సురేశ్వరా! నీ ఆజ్ఞ శిరసావహించి యిప్పుడే ఆ పర్వతమునందు పసించు మునుల తపోనియమమును భంగ పుచ్చెదను. ధ్యానము చెఱచెదను. మానవిరసత మాన్పెదను. జపము చాలింపఁజేసెదను. వారి నాలుకల మీఁద

మన్మథ మంత్రాక్షరములు లిఖించెదను. వీవనయును నిలుపుటద్దమును, కుంచెయును, పసిఁడి కాళంజియును, కర్పూరపు వైఁడి గిన్నెయును, అడపమును మోచి. మునులు నా కనుసన్నల బంటులై వచ్చుచుండఁగా నీ దర్శనము చేసెదను.

దివిజేశ్వరా! వారు నాకు చేయు దాస్యములో ఇది యేపాటిది? నీ చూపు సోఁకినచో మదనవైరి యైనను ధైర్యము గోల్పోయి నా దాస్యమునకు పూనుకొనకుండునా? నా శక్తి యెట్టిదో విష్ణుదేవుఁడే యెఱుఁగును."

అనఁగా ఉపేంద్రుడు (ఇంద్రునకు సోదరుఁడుగా జన్మించిన వాఁడు - విష్ణువు) నవ్వినాఁడు. ఇంద్రుఁడు సంతోషముతో తాంబూలము ఆభరణములు ఇచ్చి రంభను వీడ్కొలిపినాఁడు. ఆమె తోడిఅచ్చరలతో కూడి మదనుని వాఁడిఅమ్ములవలె తన నివాసమునుండి వెలువడినది.

అప్పు డామె కొప్పునందలి కల్ప వృక్షపుష్పముల వాసనలకు తుమ్మెదలు జుమ్మని క్రమ్ముకొన్నవి. నాసికాగ్రము మీఁద నున్న ముక్యాలముక్కరవెలుఁగు కమ్మని కెమ్మోవి మీఁదగంతు లిడినది. వాలుఁగన్నుల మెఱుఁగులు వఱాజు తన చేతిలోని కత్తిని జాడించినట్లు తళతళలాడినవి. కుండలముల చకచక కాంతులు లేతచెక్కిళ్ళమీఁద ధళధళ లాడినవి గుబ్బల మొఱుఁగులు హారికలోనుండి దూసికొని వచ్చుచు చూపరి కన్నులకు మిఱుమిట్లు గొలిపినవి.

ఇట్లు ఊరుజితరంభ (తొడలచేత అణిచిన బోదెలను గెలిచినది) అగు రంభ సారంభముతో ఆ శతశృంగపర్వత మును చేరఁగా, మేనక మొదలయిన అప్సరసలు ఆమెతో ఇట్లన్నారు.

"చిగురాకుబోణీ! కామదేవునిఆనతిచేత, మన కంటె ముందుగానే సుందరుఁడైన వసంతుఁడు ఇచ్చట విడిసి యున్నాఁడు. ముదిరిన ఆకులు రాలినవి. మొగ్గలు తలలెత్తి నవి. చిగురాకులు మిక్కిలి యైనవి. పుష్పాలతావులు పొలుపు మీఱినవి. పిందెలు ఫలములై పక్షుల తపఃఫలము లైనవి. వలరాజు సేనలకోరికలు తీఱినట్లు పూఁదేనె సోసలు కుసినవి. కమ్మతెమ్మెర చల్లఁగా వీచినది. పరా గము రాగము నించినది."

ఇట్లనుచు అచ్చరలు మెల్లమెల్లన నడచుచు, ముచ్చట లాడుచు శృంగారసారజీవన మైన వనము చేరినారు. కొప్పులు విప్పి జడలు సొగసుగా ధరించి, పోకముడి బిగించి, సన్నని చీరలు పిరిచుట్లుగా చుట్టి పూలు గోయుచు వనమున విహ రించుటకు పూనుకొన్నారు.

"కొమ్మా! ఈ కొమ్మవిరులు నీకేల (చేతితో) అందుకో! అటుపోవ నీకేల? కేసరములు వేని కేసరమునకు (ఏ దండకు) అయినను నందన పుష్పములు శోభిల్లును. చంపకామోదా! (సంపెంగ తావి కలదానా) చెంప చంప కము (సంపెంగ) ఉన్నచో తుమ్మెద రానేరదు. ఈ ప్రకా-

నిలఁబడుము? వావిలిపూవు లీయవా! విలువకు నేమంతి నీవంతు చేసినాము. బాలా! నీకిందే పూఁబాళ యేల? నీకు కంకేళిచిగురు కేళి కొనఁగూడెను. మొల్ల లే మొల్లము. ఎల్లరు మెల్లన రాఁడే!"

అనుచు ఆ పద్మముఖులు తమ మేని మెఱుఁగులు అంతకంతకు దట్టము లగు మెఱుపులఒఱపు గలిగిచు చుండఁగా, తమ మంజీరములయుళింయుళిధ్వనులు ఉఱు ములవలె ఒప్పుచుండఁగా, తమ రత్నాభరణముల ధళ ధళలు జడివానలవలె విలసిల్లుచుండఁగా, తమ విహారము లందు జడలనుండి రాలుపువ్వులు వడగండ్లవలె గోచ రించుచుండఁగా వనములను పెంచుటకై వనభరణలీల (నీటిని భరించు మేఘముల విలాసము)తో కాదంబిను లేమో (మబ్బులేమో) అనునట్లు అందగించినారు. శరీరకాంతులు అను తీఁగలకు నవ్వులనెడు పువ్వులకు శరీరపరిమళము లను తావులకు ఐక్యము కలిగిన ఆ కాంతలు జనముల చేపట్టి యేలు జనపతులపలె నయము చూపినారు. ఉరము (ఒమ్మ) బింకాలి అతిశయించి ఐరావతము కుంభములను పరిహసించునట్టి ఆ కాంతల కుచములు ఎంతో ఘనత వహిం చినవి. మొనగాఁడ్రయిన వారికి ఉన్నతిమీఁద ఉన్నతి కలుగును గదా! చెలీ! తన మాట తియ్యఁదనము నీ పలుకు సాటికి రాలేక పోవుటచేత కోపము తెచ్చుకొని యీ చిలుక ముఖ మెట్టఁగాఁజేసికొన్నది. వలపుకానుక పెట్టు పూవులకు ఊరువులను (తొడలను) పుప్పొడిచల్లు తీఁగలకు

Acc. No. 11367 Cl. No. ఆ. సా. 83
హస్తముల మూలకాంతులును మిక్కిలి వన్నె కూర్చునట్లు ప్రకాశించినారు భామలు. అన్యోన్యబంధుభావములు అట్లుండును గదా! తరళనయనా! (చలించు కన్నులు కలదానా!) చిలుకపోటులజీరలు గల దానిమ్మపండు విటుని గోటిపోటుతాఁకులకు పేటు లెత్తు గబ్బి గుబ్బవలె ఉన్నది చూడు! కాంతలారా! ఎన్నఁడు మాట దాఁటని చిలుక గుంపులకు ఫలభంగములు చేయుట పాడియా! ఒక కుత్తుకగా (గొంతుగా) ఉండు కోయిలలకు లేఁతచిగుళ్ళు లేకుండఁ జేయుట మర్యాదయా! నడకలో కొంచెమైనను బెఱుకు కలుగకుండ సంచరించు రాయంచలను అలయించుట న్యాయమా! కన్నుసన్నలనే మెలఁగ నేర్చు వెన్నెల పులుఁగులకు సిలుఁగులు (కష్టములు) కలిగింప వచ్చునా? చుట్టఱికము లక్ష్యపెట్టక యిట్లు పొగరు చూపు చేఁతలతో అగడు పెట్టినచో అవి నొచ్చుకొనవా? తమకు వీలు కలిగినప్పుడు గొడవ పెట్టవా? మీకీ చింత ఉండనక్కఱలేదా"

ఇట్లు విహరించుచు ఆ కాంతలు పలుకఁగా, తాఁకఁగా, ఊర్పు సోఁకింపఁగా, చూడఁగా, పాడఁగా. ముఖమెత్తగా, పాదములతో తన్నఁగా, ఉమియఁగా, కౌగిలింపఁగా, గోఁగు, తియ్యమామిడి, మల్లె. తిలకము, ప్రేంకణము. సంపెంగ. పొన్న, పొగడ, సురపొన్న, క్రోవి హెచ్చుగా పువ్వు లిచ్చినవి. మద్యము ఉమియఁగా కేసరము, చూడఁగా తిలకము, కౌఁగిలింపఁగా కురవము, తన్నఁగా వంజులము, పాడఁగా ప్రేంకణము, చేత తాఁకగా

శాఖా గ్రంథాలయము
చీరాల.

మావి, మూర్కొనగా వావిలి, పలుకఁగా గోఁగు మోము ఎత్తఁగా సంపెంగ, ఉమియఁగా సురపొన్న పూచినవి.

"ఈ మామిడి పూవిలుకాని అమ్ములపొది, ఈ వలరా! చలమేటికి!" "పొదిరి పూవుల మీఁద చేయి వెపకు! సాదువ వాదువు" "ఏలకి తీఁగలకై వాదు లేటికే!" "వగ లేటికే! మీ రెంతటి సాదులు!" "ఇందు వదనా. ఈ విరి తీవకు రమ్ము! అందని పూవుల కాసించి పోకు!" "పొన్నల నీడకు రాకే!" ఇవి పొగడవువ్వలు. గోయకుఁడు! అగడు తనముతో అందఱు పైఁబడకుఁడు!" ఆ మొల్లలకై రంతు లెందులకే? ఈ సేమంతులు వానికెందు తీసిపోయినవి?" "విరవాదులకా విడవని రోసములు? మఱచినావా చెలీ! మన్నన దోసము" "సుర పొన్నల చిగురుఁ గొమ్మలు విఱు వకు." నేదఁగి పువ్వులు గోసినావా? నాతో నవ్వులు పనికిరావు." "బొండు మల్లెలకా ముచ్చటలు: అచ్చట మిండ తుమ్మెదలు మెండు." "గన్నెరు పూలకు కన్నెఱ్ఱి సేయుదురఁటె!" "పలుకకే! చిలుకలు బారులు దీఱినవి." "నీ సరసత మిక్కిలి మీఱిన దేమో!" "చెలీ! పూల గుత్తులు గోయుచు ఈ తుమ్మెదకు వెఱచి యిది పాఱి పోయినది. ఎంత వెంగలియే!"

ఇట్లు అప్సరసలు పరిహాసము లాడుచు, తేన కాలు వల యందు తెప్పలలో తేలుచు, పుష్పాసవములను గ్రోలుచు, పావురముల వలె పలుకుచు, పువ్వాడి తిన్నెల

యందు పాడుచు, కర్పూర కదళికలను కడలించి ఆడుచు ఎంతో సేపు విహరించినారు.

తరువాత అందఱును ఆ మహర్షులను సమీపించి నారు. "అబ్బా! వీరి తేజము అగ్ని కన్నను వేఁడి. దగ్గఱకు పోరాదు. పంతము పలుకుట సిగ్గులచేఁబడినది. ఇంకేమి చేయుదుము! అమరులు వినుచుండఁగా అమరపతిముందు మనము పలికిన పలుకు లిప్పు డమరక పోయినవికదా!" అని సిగ్గుపడుచు, ఆ అమరసతులు "అయినను మనప్రయత్నము మనము చేయుదము" అనుకొని, తుమ్మెదలకు పాటలు నేర్పునట్లు పాటలు పాడినారు. కోయిలలను కవ్వించి పిలుచునట్లు తియ్యనిగొంతు లెత్తి తేనెలు చిందునట్లు పలికి నారు హంసలను ఉడికించునట్లు మిక్కిలి ఒయ్యారముగా నడచినారు. నెమిళ్ళను జంటించునట్లు గిలకొట్టి బెట్టుగా కేక లిడినారు. పూఁదేనెలను కరయంత్రములతో చల్లినారు. విలాసములు అతిశయించునట్లు విరి తీఁగెల ఉయ్యాల లూఁగి నారు. పూలబంతు లాడినారు. భావము, హేల, అనుభావము మొదలయిన అలంకారములను ప్రకటించుచు దగ్గఱకు చేరినారు. ఆ మునుల హృదయములు గుమ్మెలు పోవునట్లు గుబ్బలతో గుమ్మినారు. గట్టిగా బిగియార కౌగలించుకొన్నారు. కర్పూరతాంబూల పరిమళములు గుబాళించునట్లు చెవులకడ నోళ్ళుంచి ఏమేమో గొణిగినారు. కరకం

కణములు మ్రోఁగుచుండఁగా పదముల చిటుకలు దీసి మచ్చికలు చేసినారు. కళాస్థానము లంటి కంఠములందు సందిళ్ళయందు వాసడిగ్రోళ్ళతో గ్రుచ్చినారు. ఎంత కఱఁగించినను కొంచెమయినను చలనము లేక, ఱాతిబొమ్మల వలె నున్న ఆ జడదారులను చూచి సిగ్గుపడి, తలలు వంచుకొని, తమ నేర్పు లన్నియు చాలించి అలసినారు. మధ్యాహ్న సూర్యుని ఆతపమువంటి మునుల ఆ తపములకు నిలువఁజాలక జాఱుచున్న నీవులతో (పోకముడులతో) వాడిన మోవులతో, తడఁబడు ఊరువులతో మన్మథుఁడు ఎక్కి విడిచిన గుఱ్ఱములవలె వెనుదిరిగినారు.

అప్పుడు ఎలఁదీవలను కౌఁగిలించుకొను వేడుక గల వాఁడు, కలువ తామరల వలవులు మోచువాఁడు తుమ్మెదల పాటలు మానక వినుచుండు వాఁడు అగు మలయపవమానుఁడు ఎదురైనాఁడు. వారి కప్పుడు బడలిక కొంత తగ్గినట్లయినది. కొంచెము ఓపిక తెచ్చుకొని, మఱికొంత దూరము పోయి, ఒక కమలాకరము సమీపించినారు. ఆ భరణము లన్నియు విడిచి, మొలకు చందుర కావి పావడ మాత్రమే మిగుల్చుకొని, నీల శృంగములు పూని కొలనిలో జలకము లాడుటకు దిగినారు. అప్పుడు వారి ప్రతిబింబములు ఆ తేట నీటిలో వారిని అందఱను ఆహ్వానించుటకై ఆ సరోవరలక్ష్మి అన్ని రూపములు తాల్చెనేమో అన్నట్లు శోభించినవి. కూరిమి గల నెచ్చెలులకు సయిఁదోడుల కేమి కొఱఁత!

అప్పుడు సన్నని అవికలలో చిక్కుకొనడి యున్న ఆ మదవతుల స్తనములు మన్మథుఁడు అను వేఁటగాని ఉరు లలో చిక్కుకొనడి యున్న చక్రవాక మిథునములో అనునట్లు ఒప్పినవి. ఎండ తాఁకిన వాడిన అచ్చరలకు జలజమందిర (లక్ష్మీ) దయతో పట్టించిన తెల్లగొడుగు వేమో అనునట్లు ఆకాశమున హంసలు బారులు దీఱినవి. అంతలో పంతము లాడుచు బారులు దీర్చి, సరస్సులో దిగి, ఆ కులుకు బిటారి గుబ్బెతలు గుబ్బచనుఁగవ మునుఁగు నంతటి లో తుసీటిలో నిలిచినారు. ఒకరిమీఁద ఒకరు ఎట్టఁగలువలు నల్లఁగలు వలు విసరికొన్నారు. బుట్టల కొమ్మలతో నీళ్ళు చిమ్మ కొన్నారు. వారి చనుఁగొండలు తాఁకఁగానే అలలు వెను కకు తిరిగినవి. ఔను భూ భృద్వరుల (రాజేంద్రుల - గొప్ప కొండల) సత్త్వమును మెచ్చని గొప్ప మొనకాళ్ళ మీఁద దాడిచేయు జడ మూర్తులకు (ప్రాణము లేని వానికి-మందు లకు) గెలుపు సంభవింపగలదా! ఒక రమణి నీటిలో ఈఁదు చుండగా నిగ్గు దేఱెడి ఆమె చిన్నారి మొగము వెనుకఁగల జడ జాబిల్లి భయపడి పాఱి పోవు చుఁడఁగా అలుకతో వెంబడించు రాహువో అనునట్లు ఒప్పినది. ఒక తె తన్ను పట్టుకొనలేని చెలులను చూచి నవ్వుచు ఓల పెట్టుచు, కొలను అంతట ఈఁదినది. స్తనకుంభములు అను తెప్ప ఆధారము కాఁగా అట్లు ఈఁదుట ఏమి వింత!

ఒక తరుణీ రత్నము వెల్లికిల ఈఁదుచుండఁగా స్పష్ట ముగా గోచరించెడి ఆమె కుచకుంభములు రాత్రియందు

తాము అనుభవించెడి విరహావ్యథను తప్పించుకొను ఉపాయము ఊహించిన చక్రవాక పక్షులు ఆమె ముఖమనెడు చంద్రుని సేవింప వచ్చెనేమో అనునట్లు ప్రకాశించినవి. ఒక సుందరి నిలువీత లీదు చుండగా నింపుజాబిల్లి తల్లిగా నిగ్గులీనుచు ముంగురులతోఁ గూడిన ముఖము మాత్రమే కనిపించు చుండుటచేత తుమ్మెదలతోఁగూడిన పద్మ మేమో అనునట్లు తనవారినది ఇట్లు జలక్రీడలు సలిపిన ఆ కాంతల కులుకు గుబ్బల గంధము, కంఠము లందలి కుంకుమము, నుదుటి కస్తూరి, శరీరముల పసుపు ఆ సరో లక్ష్మికి అలంకారములైనవి. కొలని నుండి వెలువడినప్పుడు చక్కని ముఖ పద్మముల సుగంధములను ఆస్వాదించుటకై ప్రాపియున్న మకరందమును వెడలఁగ్రక్కెడు తుమ్మెదలో అనునట్లు నీటి బొట్లులు రాలెడు జడలతో ఆనాలుఁగంట్లు ఎంతో చెలువు మీఱినారు. తడిసియున్న వలిపెచంద్రకావి పావడలు విడిచి, ఒండొరుల కటిస్థలములందును కుచములందును గల గోటి గుఱుతులు కనుఁగొని చిఱునవ్వులు నవ్వుచు చలువ చీరలను రత్నభూషణములను ధరించినారు. పువ్వులు తురుము కొన్నారు. అంగరాగములు అలఁదు కొన్నారు. అంతలో సూర్యుఁడు పశ్చిమ పర్వత శిఖరమును అలంకరించినాడు.

"నీవు మొదట తూర్పుదిశను కూడినావు. తరువాత పద్మినికై కరములు చాఁచినావు. చాలు చాలును. నన్ను చేరక పో పో" మ్మని పశ్చిమ దిక్కు అను కాంత కాలితో

తమ్ముట వలన ఆమె కాలి పారాణి అంటిన దేమో అను నట్లు సూర్యుని శరీరమున ఎఱుపు అతిశయించినది. మహా తేజశ్శాలి యై మెలఁగి సంపూర్ణానురాగముతో తన్నుఁ జేర వచ్చినందులకు సంతసించుచు పశ్చిమ దిక్కు అను రమణీ రత్నము ఎత్తిన నీరాజనమో, ఆ నాథుని కూఁటచేత ఆమె మేన వెల్లి విరిసినరాగమో అనునట్లు సంధ్యారాగ మలు ప్రబలినవి.

'ఉదయించినది మొదలుకొని మురిపెముతో వసు జాలము (కిరణముల సముదాయము - ధనముల సముదా యము) అంతయును నానులు (కొండచరియలను - వేశ్యలను) పొందఁ జేసినాఁడు. ద్విజరాజ (బ్రాహ్మణప్రభువు యొక్క - చంద్రునియొక్క) తేజమును అంతరింపఁజేసి, కువలయ సమృద్ధి (కలువల కలిమి - భూవలయమునందు కలిమి) తక్కు వగా చేసినాఁడు. సందుగొందులయందు గురుతరతమము (అధికమైన చీఁకటి - అధికమైన అజ్ఞానము) నిలిచి యుండు నట్లు చేసినాఁడు. పుణ్యజన (పుణ్యాత్ముల - రాక్షసుల) సమూహమును పర్ధిల్లనీయక పగలే పద్మినీసతిని (పద్మలత అను కాంతను - పద్మినీజాతి స్త్రీని) పట్టికూడినాఁడు. ఉగ్ర ప్రభుత్వము చివరిదాఁక నడపినాఁడు!' అని జనులండలును తన్ను నిందించు చుండుట వినలేక పోవుటచేతనో అనునట్లు కమల బాంధవుఁడు పశ్చిమ సముద్రమున దాఁగినాఁడు. పడ మటి కొండ కొమ్మలు తాఁకుటచేత విఱిగిన సూర్యుని బండి కన్నులనుండి జాఱిపడిన కందెన యేమో, దట్టమైన

మన్మథాగ్ని భూమ మేమో అనునట్లు జగమునందు అంత టను అంధకారము వ్యాపించినది. ఏక కాలముననే లోకము లను జయించుటకై మన్మథుఁడు పంపిన తుమ్మెదల గుంపులో, భూమియును ఆకాశమును అనంతత్వమునకై పెనఁగు లాడుటకై సందు లేకుండ దగ్గఱకు చేరుకొన్నవో, భూమియందలి తమపుట్టినిండ్లను చూడవచ్చిన కారు మబ్బులో అనునట్లు చీఁకట్లు దట్టము లయినవి. చీఁకటి అను దొంగ కుటిలవర్తనముతో పరాక్రమించి దిక్కులను ఆక్ర మింపఁగా తుమ్మెద తామరతోటనుండి నల్లఁగలువల లోని తేఁకలు అను గుహలలో చేరుటకై వలస పోయినవి.

కాలము అను వర్తకుఁడు సాటి లేని సంధ్యారాగ ములు అను పద్మరాగమణులను తీసివైచి నీలాకాశ మనెడు నల్లని దుప్పటిమీఁద పఱచిన ఆణిముత్యముల మొత్తములో అనునట్లు ఆకాశమునందు నక్షత్రములు పొడ చూపినవి. ఆకాశ మండలమనెడు మధూకతరువునందు శోభిల్లు పుష్పములో అనునట్లు చుక్కలు అంతకంతకు కాంతులు వెదచల్లినవి. కలువల చుట్టము, జక్కవల దాయ' వేలుపుదొర అయ్యవారి సానికి వలపుదీము, రేయిపడఁతుక మోము, తుంట విలుకాని గులాము, మంచువెలుఁగుల తెలిమేడ, మొల్లవన్నెలాఁడు అగు చంద్రమామ చల్లని వెలుఁగులు చల్లుచు తూర్పున కనుపట్టినాఁడు. కుపలయమున (భూవలయమందు – కలువలయందు) చరించు తుమ్మెదల పాట లనెడు దేవతాస్తుతులు చెలరేఁగుచుండఁగా, చకోరము లనెడు మునులు సంతసిల్లుచుండఁగా తనకరములనెడు బా ణ

ములచేత చీఁకట్లు అనెడు రాక్షసులను చీల్చుచు తూర్పు కొండ అనెడు గగుత్మంతుని మూఁపున కమలాహితుఁడు (చంద్రుఁడు-విష్ణువు) వెలుఁగొందినాఁడు. ఆకసపు టంగడిలో పచ్చకప్పురము కుప్పలుపోసినట్లు, రాయంచలు గుంపులు గూడినట్లు గందపులప్పలు విప్పినట్లు, మొల్లలదండలు కట్టినట్లు మగరాలు చల్లినట్లు, వింజామరములు వ్రేఁగట్టినట్లు పాలు ఆఁబోసినట్లు, శంఖములు పఱచినట్లు, తెల్లు పూచినట్లు, మల్లెపువ్వులు విరిసినట్లు, తెలిదమ్మలేకలు నిండినట్లు పండు వెన్నెల అన్నివైపులపర్వినది.

ఆ సమయమున వెన్నెల పులుఁగులు వన్నెచిన్నెలు గల చిన్నారి పొన్నారి తొగరేకు చిప్పలను పానపాత్రలుగా చేసికొన్నవి. కలకలారావములతో ఒండొంటిని పిలుచుకొనుచు, అలుపుగ లయినవి వలపు కినుకలుచూపుచు అంతలోనే కఱఁగుచు నిండుపన్నీటియేటి కాలువల తావుల తావులు గుబులుకొను కన్నెవెన్నెలలు నంజుకొన్నవి. చెఱుకురసములకన్న తియ్యనగు గుజ్జు వెన్నెలలునంజుకొన్నవి. ఒకదాని నొకటి బుజ్జగించుచు ప్రేమతో వెన్నెల రసములు ప్రోవనిచ్చినవి. పెంటి ప్రోపిన తరువాతనే పోతుపిట్ట ప్రోపినది. ప్రోపినపిమ్మట రెండును మదమెక్కి నిక్కినవి. మక్కువతో మదన సామ్రాజ్య సంపదతో పొంపిరిపోవుచు నింగికెగసినవి. తమతమ జతపిట్టలను గుర్తింపలేక పైఁబడఁజూచు వానిని ముక్కులతో పొడిచి, నోళ్ళతో టొక్కి, ఎట్టకేలకు జతపిట్టలను చేరి సుఖించినది. మదాతిశయమున

జగడములకు పూనుకొని తీర్పులకై యితరములగు విహంగముల నాశ్రయించినవి. తమ్ము బలపఱచు సాక్షులను సమకూర్చుకొని తగవులు నడపినవి. కలువఱేకులు బాకులుగాఁ జేసికొని కయ్యము లాడినవి. ఎఱ్ఱకలువపూవులు కాఁడలతో కూర్చి అకరువులను మెట్లుగా చేసికొని నూలువంటి పోగులను తీఁగలుగా కూర్చుకొని, కొనగోళ్ళతో నీటుగా మీటుచు నచ్చిన బోఁటులను ఆకర్షించుటకు గానము లారంభించినవి మగపులుఁగులు.

రంభ మొదలయిన అప్పరసలు ఆ పులుఁగుల వింత చేష్టలు చూచుచు కొంతతడవు వినోదించి, తమకు అసాధ్యులుగా నున్న సప్తర్షులను చేరుటకు వెఱచి "ఫాలాక్షుని ఫాలనేత్రాగ్ని జ్వాలలవలె వీరితపోఽగ్ని జ్వాలలు భయంకరములై యున్నవి. మన్మథుఁడు వీరిధైర్యమును హరింపఁజాలఁడు. అదిగో! అరుంధతీదేవి. ఎంతచక్కనిది! అయినను వసిష్ఠమునీంద్రుని చిత్తము మదనాయత్తము చేయలేక తానును తపోమగ్నురాలై యున్నది. మన ఆటలు, మన పాటలు మనశృంగార చేష్టలు నిరుపయోగములు. ఇతరులు మనపాట్లు చూడకముందే మనము ఇచ్చటనుండి తొలఁగిపోవుటయే కర్తవ్యము." అనుకొని వచ్చిన త్రోవనే మఱలిపోయినారు.

అంతట 'ఓహో! ఎంత ధీరులీ మహర్షులు!' అని ఆ మునీంద్రులను చూడఁగోరి వచ్చినట్లు వేగుఁజుక్క కనుపట్టి

నది. "అచ్చరలు తొందరగా మేలుకొని తమ నివాసములకు పోయినారు. నేను ఇక్కడనే ఉన్నచో వీరు ఎప్పుడు కన్ను తెఱతురో! ఏ మందురో! జాగు చేసినచో ప్రమాద మగును." అని భయపడి సప్తకూటములమాటున దాగగ బోయినట్లు చంద్రుడు వినువీధినుండి జాఱినాడు. గగన లక్ష్మి ముందుగా తుఱుముకొన్న మొల్లసరులను తొలగించి కొప్పునందు సంపంగిపూవులను తుఱుముకొన్నదేమో అను నట్లు చుక్కలు తొలగగగా సూర్యకాంతులు కొన్ని ఆకాశ మున మెఱసినవి.

చీకట్లు అనెడు రక్కసుల మీద దాడి చేయబోవు దేవేంద్రుని తెలిపట్టు గుడార మేమో! సూర్యుడు వచ్చు చున్నాడని తూర్పుదిక్కు అనుకాంత అలంకరణము కొఱకై చేపట్టిన రత్నదర్పణ మేమో! ఉదయ పర్వతము అను శ్రీహరి వక్షమునందు ప్రకాశించు కౌస్తుభమణి యేమో! పూర్వసముద్రతీరము సమీపమున కానవచ్చు మెత్తని పగడపు పొదరిల్లేమో! అనునట్లు లోకానందలక్ష్మికి పెంపును, అందాల తామర గుంపులకు సొంపును, కటికి చీకటి తిండియును, శంకరుని బండియును, వే వెలుగుల జోడును, ముగ్గురు మూర్తుల పాదును, చమ్మల బరణియును అగు తరణి (సూర్యుడు) తూర్పుదిక్కున తోచినాడు.

అచ్చట మునీశ్వరులు ఆకాశనదిలో నిత్యకృత్యములు తీర్చి, ఇసుక తిన్నెలమీద కూర్చుండి ఒండొరు

లను చూచి 'మనము అత్యుగ్రతప మారంభించి యెన్నో వేలయేండ్లు కడచినవి. విఘ్నములు వచ్చినవి. ఆ జగదీశ్వరుని జాడ కానరాదు. మనవంటి భాగ్యహీనుల కా రమాకాంతుడు ప్రత్యక్ష మగునా? తాపసులలో వాసియు వన్నెయు పోయి తలవంపు లగునట్లు పూనిక విడిచి పోకూడదు.

"ఇప్పు డేమి చేయుదము? మనకు గతి యేమి?" అనుకొను చుండగా ఆకాశవాణి యిట్లు పలికినది.

"మహర్షులారా! మీ రీ పర్వతము మీఁద తప మాచరించుటకు పూనుకొని యెన్నో సంవత్సరములు గడచెను. ఆ గోమల శ్యామలమూర్తి యిచ్చట ప్రత్యక్ష మగుట అబద్ధము. వినుఁడు! నేను మీ కొక విశేష మెఱిం గించెదను. మీరు ఘటికాచలమునకు పొండు! అచ్చట ఘటికామాత్రముననే మీకోరిక ఘటిల్లును. ఘటికాద్రి మాద్రి అద్రి మహిలో కలదా?

గంగానదికి దక్షిణదిక్కున నూఱు యోజనముల దూరాన వేదవిద్యాదేవికి కాంచి (మొలనూలు)అగు కాంచీపురము కలదు. దానికి ఆపల ఉన్నది ఘటికాచలము. అచ్చట అణువంతతపము చేసినను కోటిగుణిత మయిన ఫలము కలుగును.

అశరీరవాణిపలుకులు విన్న సప్తమహర్షులును అప్పుడే బయలుదేరి ఎన్నో పుణ్యాశ్రమములను నదులును, దర్శిం

చుచు దక్షిణముగా పోయి పోయి, గంగానదిని దర్శించినారు. తొలుత శ్రీమన్నారాయణుని పాదపంకజమునందు జన్మించి, సత్యలోకమును పాలించు పరమేష్ఠి కాల్యకరణీయములకు మూల మయిన కమండలువును పావన మొనర్చి, నిటలాక్షుని జటాజూటమును తెప్పలఁ దేల్చి భగీరథునితపము హేతువుగా హిమాలయపర్వతము మీదుఁగా భూమికి అవతరించి, తనలో మునుఁగువారిపాపములను అంతరింపఁ జేయు రంగత్తరంగములు గలధియును, మూఁడులోకములవారు చేసెడు పుణ్యములవలన పెంపొందెడు నిజాంగములు గలదియును, అగు ఆ గంగకు సాష్టాంగనమస్కారము లాచరించి, స్తుతులు గావించి, అందు స్నానమ లొనర్చినారు.

జలధరశ్యాముఁడు ను, శాంకరీస్తుతనామఁడును, సకల దేవతాసార్వభౌముఁడును, నీలాచలనివాసుఁడును పాలిత నిజదాసుఁడును, కనకవాసుఁడును, అఖిలలోకాధ్యక్షుఁడు ను, పాతకగజహార్యక్షుఁడును కౌస్తుభశ్రీవత్సశోభితవక్షుఁడును, నందగోపకుమారుఁడును, హారకిరిటకేయూరహారుఁడును, గోపికాజారుఁడును, యమునాతీరవిహారుఁడును, ఆదిలక్ష్మీ సనాథుఁడును అగు జగన్నాథుని కాంచి సేవించి పూజించి మిక్కిలి నుతించి హర్షపులకితశరీరు లయినారు.

గంగకన్నను అధికురా లై సృద్ధగంగ అని పేరు పొందిన పుణ్యనదిని దర్శంచి అంచ కృతావగాహు లై ఆనందించినారు. శ్రీకాకుళవిష్ణుని పూజించి ప్రారబ్ధి

మనస్కృతములనుండి విముక్తులయినారు. కలహంసల పలుకులు పలుకులుగా, కమలములు కరములుగా, ఆసుక తిన్నెలు పిఱుదులుగా, శైవాలము వేణిగా గల వారి రాణిని కృష్ణవేణిని సందర్శించినారు. అందు మునుకలిడ్డి ముదమందుచు వేంకటేశ్వరుని దివాణమైన వేంకటాచలమున కేగినారు. కనకరత్నప్రభలకు మూలమయిన ధాతువులు గల గుహాతటములతో, ఎత్తయిన శిఖరములతో, సంసార బంధము అనెడు ఇంధనములకు ధనంజయరూపము లగు(అగ్ని రూపములగు) తీర్థరాజములతో సనకసనందనాదులచే కొనియాడబడు ఆ శేషశైలమును వీక్షించినారు. వీక్షించి పరమానందభరితు లగుచు ఆ గిరీంద్రము నెక్కి, తామరపూలనుండి స్రవించు తేనెలసోనలచేత పుట్టుచుండు సారభమునకు నిలయమై, తాలము, హింతాలము, తమాలము, రసాలము మొదలగు నానాజాతితరువులు గల విశాలోద్యానవనములతో ఒప్పి, వికసించిన ఎఱ్ఱగలువలతో తెల్లగలువలతో, నల్లగలువలతో నిండియుండి మధువుకొఱకై సంచరించెడి తుమ్మెదలయొంకారములను, అనుకరించెడి ఘుమఘుమధ్వనులు గల కెఱటములతో శోభిల్లి, ఆ అలలయందు ఈగుచుండు రాజహంసముల ఱెక్కలవలన పుట్టెడి గాలులచేత ఎగిరిపడుజలకణములచేత సూర్యకిరణములను కప్పివైచి ద్రవిడ విలాసినుల స్తనములందు గల కొత్తపసుపు పూతలు అవరించుటచేత బంగారుఅవిక ధరించినట్లు పరిఢవిల్లి. మాళవి, మాలతి, మల్లిక మున్నగు సుమసమూహముల కేసరములచే పార్శ్వములయందు అధికశోభ వహించిన

స్వామిపుష్కరిణియందు మునిగి కాల్యకరణీయములు నిర్వర్తించినారు. కాంచనశైల మేమో అను భ్రాంతిని కలిగించెడి దేవాలయప్రాకారమును చేరినారు. భేరీ మృదంగ ధ్వనులచేత సముద్రఘోషమును కబళించుచు, ఎడతెగని ధూపధూమములను పొగలను చూచి మబ్బులనుకొని తాండవించునెమళ్ళు కలిగి, కేతనాంచలముల కింకిణుల కలకలధ్వనులచేత సూర్యరథాశ్వములకు జంకు పుట్టించి. ప్రాకారములందలి మణులకాంతులచేత దిగ్గజముల గండస్థలములకు సిందూరపుప్రాతలు కల్గించి, ప్రతిదినము నటించు చుండెడినటులపాదహంసకధ్వనులచే బ్రహ్మదేవునివాహనమైనహంసకు స్వామిసేవయందు ఆసక్తి గలిగించి రప్పించు చొనెడి వేంకటేశ్వరాలయమును ప్రవేశించినారు.

పొడుపుకొండమీద పుట్టెడి లేతప్రొద్దువంటి కిరీటము ధరించినవాడును, అర్ధచంద్రునివెన్ను చఱచెడి చక్కనినుదుటిమీద ముత్యాలతిరుమణి మురువుమీఱువాడును, మకరముఖకాంతులు దీపించుసుందరకుండలములు తాల్చినవాడును, పెదవులమూలల చిఱునవ్వువెలుఁగులు లేతచెక్కిళ్ళమీద చిందులాడువాడును కలువతామరకన్నెలను వలపించుచల్లనివెచ్చని చూపులవాడును లావణ్యసముద్రపుచెలియలికట్టయందు పొడమినపగడ మేమో అనిపించు సొగసువాతెర గలవాడును అగు ఆ శ్రీనివాసుని దర్శించినారు.

ఆస్వామిచేతిశంఖమునకు ఏకగ్రీవమైనట్లు కంఠము చెన్నుమీఱుచున్నది. రూపు దాల్చిన కీర్తిప్రతాపము

లేమో అనునట్లు శంఖచక్రములు చేతులందు వెలుఁగొందు చున్నవి. ఆ కల్పఫలము (కల్పాంతమందుకూడ స్థిరమైనఫలము) ఇచ్చెడి ఆ కల్పశాఖలకు (కల్పవృక్షపుకొమ్మలను) దాయా దులనలె బాహువులు ప్రకాశించుచున్నవి. అలమేలుమంగకు ఇరవుగా ఉరము సుందరముగా ఒప్పుచున్నది. నలుమొగ ములకుట్టిను గన్నతల్లిగా నాభి శోభ మీఱుచున్నది. దానవ వనములకు కుఠార మైన కటారము కటితటమున క్రాలు చున్నది.

స్వామి మొలకు బంగారుప్రాతచెఱఁగులపట్టుదుప్పటి కట్టుకొన్నాఁడు. పద్మరాగప్రభలు గల పాదపద్మములకు వేద మంజీరములు తాల్చినాఁడు. ఒడలినిండ మిక్కిలి మెఱుఁగెడి రత్నభూషణములను ధరించినాఁడు. మెఱుఁగుచామనచాయ మేనియందు శృంగారరసరుచిశ్రీలు చిందించుచున్నాఁడు. సర్వదేవతాసార్వభౌముఁ డని బిరుదు వహించినాఁడు. అతఁడు నెనరు గలవాఁడు; పొగడఁ దనరువాఁడు. దయతో కూడినచేతన గలవాఁడు; తనవానిని తనయంతవానినిఁగా మనుచువాఁడు పదములయందు పొదలు ఆపగవాఁడు. (నదిగలవాఁడు) పగవాని పగవానికాఁపు అనుబిరుదు గల వాఁడు. నెమ్మోమునందు నగవువెన్నెలవాఁడు. నెలవానిచెలి కన్నులుగాఁ గలవాఁడు. అంబుదము డంబు (మేఘచ్ఛాయ) మీఱు గాత్రము గలవాఁడు. నేను కొండను. మీ కోరిక కొండను కొండవాఁడు నిలువు గల పైఁడిచెలువుల వలువ వాఁడు. మేలు సమకూర్చు అలమేలువాఁడు.

తల నిల్లు గట్టు వ్రతముల రాయనితో మని పళ్ళెరముల నేమగాఁడు. చేరుడుబియ్యా ఓణిరములు తినువాఁడు కోణంగిసేవలనాణెగాఁడు. కానుకలకు వడ్డికాసులు గొను వాఁడు. ముక్కోటితీర్థపుటెక్కులాఁడు. అడుఁగడుఁగునకు మ్రొక్కులందుకొనువాఁడు. కూకటిమాడలు గుత్తగొను వాఁడు, శుక్రవారపుసేవ లందుకొనుసొగసువాఁడు. మానవ తులను కోరి వలపించుమాయలాఁడు. తిండి మెండైన అయ్య గారు.

అట్టి వేంకటేశ్వరుని దర్శించి ఆ మునీశ్వరులు ఈవిధ ముగా స్తుతించినారు.

"వృషభశైలేంద్ర దివ్యమందిరునకు అభివాదనము. గరుడాచలపతికి దండము. శేషాచలగృహస్థునకు అంజలి. శ్రీవేంకటాద్రియజమానునకు వినతి. అంజనాద్రి ప్రసిద్ధనిధికి చిన్నిపూవు. గుహసరసీకేళీప్రియునకు శరణు. త్రిమూర్తుల మొదలిదొరకు నమస్కారము. గజేంద్రవరదునకు జోహారు. సర్వేశా! సర్వాత్మా! సర్వగుణాతీతా! సర్వజనావన సదయహృదయా! గోపాలా! గోపాలగోపనప్రవీణా! గజేంద్రదుఃఖనివారణా! వారణశిక్షణదక్షసింహపరాక్రమా! శేషాచలేశా! అశేషలోకనివేశా! శేషతల్పా! నీలనీరద గాత్రా! తీర్థతీర్థమహాతీర్థా! తీర్థపాదా! నందనందనా! సనక సనందనవినుతా! శరణు శరణయ్యా శరణార్థిశరణచరణా!

భువనములను పుట్టించుటకు, పోషించుటకు, అణఁగించుటకు కర్త యైన ప్రధానమూర్తివి నీవే. శిరస్సు మొదలగు సమస్తావయములును బహుళములుగాఁ గానవచ్చు లోకకుక్షివి నీవే. కొలిచెడివారికి కోరికలు దయచేసి రాజిల్లెడు వేల్పుల రాజవు నీవే. బ్రహ్మదేవుఁడును, ఈశ్వరుఁడును, దేవేంద్రుఁడును మొదలగు దేవతలు నిజ మెఱుఁగని జ్ఞాన నిధివి నీవే. ధ్యానము ఫలింపని తాపసులకు అలవి గాని బ్రహ్మపదార్థము నీవే. శంఖము, చక్రము, గద, ఖడ్గము, శార్ఙ్గము ఒప్పియుండు చతుర్భుజుఁడవు నీవే.

విబుధులకు (పండితులకు, దేవతలకు) విబుధభూజము (కల్పవృక్షము) విబుధవైరులకు (రాక్షసులకు) విషవృక్షము నయి, అబలులకు అందఱకు బల మై ప్రబలెడు మహామహుఁడవు నీవే.

తులసిఱేకుల చేత నైనను, గరికల చేత నైనను, జలములచేత నైనను, జలజముల చేతనైనను నిన్ను పూజించెడి మహామహులకు ఇహపరములు చేకూరును. నీ మహామహిమను తెలిసినవారు ధన్యులై ప్రవర్తింతురు. బ్రహ్మాదులు కాంచలేని వేదమంజీరుని నిన్ను చూడఁగలిగినాము కనుక సంసార సముద్రము దాఁటఁగలిగినాము. మా జన్మములు తరించినవి. మా జపములు ధన్యము లయినవి. మా యత్నములు ఫలించినవి."

భువనములను పుట్టించుటకు, పోషించుటకు, అణగించుటకు కర్త వైన ప్రధానమూర్తివి నీవే. శిరస్సు మొదలగు సమస్తావయములును బహుళములుగా గానవచ్చు లోకక్షిని నీవే. కొలిచెడివారికి కోరికలు దయచేసి తూర్చెడు వేల్పుల రాజవు నీవే. బ్రహ్మదేవుడును, ఈశ్వరుడును, దేవేంద్రుడును మొదలగుదేవతలు నిజ మెఱుంగని జ్ఞాన నిధివి నీవే. ధ్యానము ఫలింపని తాపసులకు అలవి గాని బ్రహ్మపదార్థము నీవే. శంఖము, చక్రము, గద, ఖడ్గము, శార్ఙ్గము ఒప్పియుండు చతుర్భుజుడవు నీవే.

విబుధులకు (పండితులకు, దేవతలకు) విబుధభూజము (కల్పవృక్షము) విబుధవైరులకు (రాక్షసులకు) విషవృక్షము నయి, అబలులకు అందఱికు బల మై ప్రబలెడు మహామహుడవు నీవే.

తులసిజేకుల చేత నైనను, గరికల చేత నైనను, జలముల చేత నైనను, జలజముల చేతనైనను నిన్ను పూజించెడి మహామహులకు ఇహపరములు చేకూరును. నీ మహిమను తెలిసినవారు ధన్యులై ప్రవర్తింతురు. బ్రహ్మాదులు కాంచలేని వేదమంజీరుని నిన్నుచూడఁగలిగినాము కనుక సంసార సముద్రము దాటఁగలిగినాము. మా జన్మములు తరించినవి. మా జపములు ధన్యము లయినవి. మా యత్నములు ఫలించినవి."

ఈవిధముగా స్వామిని స్తుతించి, మఱల మఱల పండ నము లొనరించి అనుగ్రహ పాత్రు లై ఆ మందిరమునుండి వెలువడి ఆ గిరిరాజమును అవలోకించినారు.

"కోటి సూర్యకాంతులను మించునట్టిజేగురులు గల శిఖరములు చెంగఁ గల ఆకాశమును వహించియున్నమణి మయస్తంభములువలె ఒప్పుచున్నవి. ఈ కొండ ఆకాశ మును తాఁకునట్టిశిఖరములు వేయిపడగలువలెను, వానిపైఁ గల ధాతురాగములతో సమన్వితము లయిన తారకలు ఆ పడగలమీఁదిమణులు వలెను అమరియుండఁగా తనశేష సంజ్ఞను సార్థ మొనర్చుకొనుచున్నది. పువ్వులతో మొగ్గ లతో అందగించియుండు వృక్షశాఖలు ఈ నగరాజు దగ్గఱగా నున్న ఆకాశమును అంటుటకు ఎత్తఁబూనిన మాణిక్యభూషణములు గల బాహువు లేమో అనునట్లు అల రారుచున్నవి. ఈ అచలము మోక్షలక్ష్మిచేతికొని విరిబంతి. పాపకదళులను (పాపము లనెడు అజ్ఞటిచెట్లను)కూల్చెడిభద్ర దంతి (భద్రజాతిదేనుఁగు). ఈప్సితార్థములను ఇచ్చు (కామధేనువు). మునీశ్వరు లను తరువుల సురభి (పరిమ ళము). ఈ శైలము వైభవము, ఈ క్షేత్రము సౌభాగ్యము, ఈ పుణ్యతీర్థము మహత్త్వము, ఈ విష్ణునికరుణ బృహస్పతి సరస్వతీపతి పన్నగపతు లైనను వర్ణింపఁగలరా? ఏమితపము చేసినామో! ఏ పుణ్యము చేసినామో! ఏనోములు నోచి నామో! మనోరథములు పండునట్లు, శుభము లొనఁగూడు

నట్లు, పాపములు పటాపంచ లగునట్లు ఇష్టదానసమర్థు
డైన మాతండ్రిని వేంకటాచలస్వామిని వీక్షించినాము."

అనిపలుకుచు ఆపర్వతరాజము దిగి అచ్చటికి దక్షిణ
మున బ్రహ్మకమండలువునాశమునుండి వెలువడిన ఆకువారి
తీర్థమున స్నానము లాడినారు. తూర్పుదిక్కునం గల శంక
రుని అర్చించినారు. గోవిందరాజులను కొలిచినారు. తిరు
పతిని విడువలేక విడువలేక విడిచి అనేక జనపదములను గడచి
కొన్నిదినములకు కాంచీపురము కాంచినారు. ఆ పురము
రత్నమయము లయిన ప్రాకారగోపుర సౌధరాజములతో
మహావైభవముగా ఉన్నది. ఆ మేడలమీఁద సంచరించు
కన్యలకు చంద్రమండలమే అద్దముగా బనఁగూడుచున్నది.
కనకసౌధములమీఁదిపతాకలు దేవపురము నంటుచున్నవి.
ప్రతిమందిరము ముందరను ముక్తాలంకరవల్లులు ముద్దు
లొలుకుచున్నవి. ఇంద్రనీలమణులతోఁ గూడి ఆకాశమును
బరయుచున్న హర్మ్యములు మేఘములు కాఁబోలు నని
భ్రమించి నెమళ్ళు పురులు విప్పి నాట్యము లాడుచున్నవి.
అట్టిపురమును చూచి అందలివిశేషములు తెలిసికొనఁగోరి
నట్లు చూచి అరుంధతీదేవితో వసిష్ఠమునీంద్రుఁ డివిధముగా
ననాఁడు.

"కుటిలకుంతలా! భరణికి మశినూపురమును, సకలజన
కామితసిద్ధులకిష్కిపురమును, గోపురసితగోపురమును (ఆకాశ
మునంటుగోపురములు కలదియును) అగు ఈ పురమును

చూచినావా! ఈ సౌధములమీఁద నీడలు దేఁకు గరుడపచ్చల తిన్నెలయందు పతులతోఁ గూడియుండుసతులు ఆ మణుల యందు ప్రతిబింబించెడు సురలోకదంపతులను చూచి వీరి గూపరేఖ లేమిజోడు!" అని పరిహాసము లాడుచుందురు. ప్రస్నమకేలయందు చంద్రకాంతమణులచే నిర్మింపఁబడిన ప్రాకారములు కఱుఁగఁగా నగరములో నిండినకాలువలు మన్మథపర్జన్యుఁడు మనుపైరులు వర్ధిల్లుటకై చంద్రుఁడు కల్పించిన మంచినీటి కాలువలో అనునట్లు ప్రవహించుచుండును. సౌధాగ్రములందలిచంద్రకాంతవేదులందు సంచరించు హారకాంతిలు చేతికి అందెడి ఆకాశగంగాపద్మములను నోయఁబోయి అందుండు తుమ్మెదలు జుమ్మనుమన్నని చేలరేఁగఁగా తోడికాంతలు నవ్వుచుండఁగా భయాతిశయమున పలాయనము చేయుచుందురు. ఇందలి మాణిక్యసౌధములు లక్ష్మీకల్యాణోత్సవసమయమున భూమి అను వేదికమీఁద నిర్మించిన మణిస్తంభములేమో అను భ్రమకలిగించుచుండును. ఈ కాంచీపురసౌభాగ్యమును కీర్తించుట యెవరితరము?

ఆకాశమును ఒరయునట్టినగరసౌధములను కొండ లనుకొని దంతములతో పొడువవచ్చిన దివ్యగజములు అందు చిత్రితము లైన సింహశిల్పములను చూచి భయపడి, దేవ తలు నిర్వాణులై చూచుచుండఁగా, వెనుదిరిగి పరుగెత్తు చుండును.

మేడలపై నిలువఁబడి పౌరాంగనలు సురకాంతలకు కమ్మకస్తూరి యిచ్చి వారికడనుండి గమగమలాడుహారి

చందనద్రవమును అందుకొనుచుండును. ప్రాకారములందలి
యింద్రనీలమణిచ్ఛాయలు కంఠహాలాహలముగా సుస్థము
విభూతిగా, కెల్లనిజెండాలు తలమీదగల గంగాప్రవా
హములుగా, అంతరాభోగమున సంచరించుకాంతలు శరీరమున
అర్ధభాగము గొన్న పార్వతీమూర్తులుగా హర్మ్యములు
ఈశ్వరమూర్తులో అనునట్లు తేజరిల్లుచుండును. కోట
ప్రాకార మయి యుండుటచేత బొన్నత్యము పొంది, సాల
మగుటచేత (వృక్షమగుటచేత) మిక్కిలి కొమ్మలు (బురు
జులు) కలిగి ఇంద్రనీలమణి విలాసములతో శ్యామల మై
భాసిల్లుచుండును. మిగులగంభీర మయిన జలముతోడగూడిన
కందకము సముద్రమే అనరాదా? తననాభియందలి పద్మము
వలె దివ్యమణిభావము ఇంపొందుచుండగా దానవాంతకుడు
డదు శయనించియుండునుగదా! "సురాలయమునందు
(స్వర్గమునందు-మద్యశాలయందు) తిరుగుచుండును. అందు
కొలువు చేయుచుండును. శుష్కపరిభావముతో చరించుచుం
డును." అని యిచ్చటి విప్రులు బృహస్పతిని నిరసించు
చుందురు.

అబలా! ఇచ్చటిరాజమార్తాండులు ఆర్యామోద
కరులై (ఈశ్వరులై, ఆర్యులకు సంతోషకరులై) ఎల్లప్పు
డును శౌర్యాసంగగరిమ (విష్ణుదేవునితో స్నేహపుగొప్ప
తనము-పరాక్రమముకలిగియుండుగొప్పతనము)తో అలరారి
ధర్మరక్షణకళాదరసమున్నతి (ధర్మరక్షణమునందు చంద
కళయందు ఆదరాతిశయము, ధర్మరక్షణకళయందు అద

రాతిశయము) వహించి, దినదినాభ్యుదయవర్ధనలు పొంది, సద్భక్తిప్రచారతచే (కాంతిగలిగిన ప్రచారము ఒప్పియుండుటచే, సజ్జనులతోకూడి ప్రచారముచేయుచుండుటచే) మంచి, ద్విజరాజపోషణమునందు (బ్రాహ్మణోత్తములను పోషించుటయందు, చంద్రునిపోషించుటయందు) ప్రీతి కలిగి, దుర్నిరీక్ష్యమై వెలిగెడుతేజముచేత ప్రకాశించి పంకమును (బురదను. పాపమును) నశింపజేయుప్రతిభతో విలసిల్లి, రాజసముతో మీఱి, కరప్రసారమునచే (కిరణములను ప్రసరింపజేయుటచేతనే, చేతులు చాచుటచేతనే) పరతమస్సోమములను (శత్రువులనెడుచీకట్లను) అంతరింపజేయుచు విరాజిల్లుచుండును.

'తనమిత్రుడు ఎల్లప్పుడును దిగంబరుడై సంచరించుచుండగా తాను ధనదుడ నని చెప్పుకొనుచు ఎక్కడకు ఒకవాహనమైనను లేక మానిసిని పనిగొన్నాడు. కలిమికలియికి ఇది మార్గము గాదు.' అని ఈ వీటిలోమటులు కుబేరుని మెచ్చును.

శ్రీకరవ్యాప్తిచేత (శోభాయుక్తములయిన కిరణముల వ్యాప్తిచేత-సంపద కలిగించువ్యాప్తిచేత) ప్రసిద్ధి పొంది విబుధలోకసేవచేతనే (దేవతలసేవచేతనే – విద్వాంసులసేవచేతనే) అభివృద్ధి పొంది ఈ పురమునందలి శూద్రకులము పుట్టిల్లయిన హరిపదపద్మమువలె సొంపు మీఱియుండును.

ఈ పుణ్యలోనినాలవజాతి హరిపదసేవ (విష్ణుపదమును సేవించుట) చెంది, విబుధాశ్రేయజీవనము (పండితులే ఆశ్రేయమగుబదుకు - దేవతలకును ఆశ్రేయమగు నీరు) స్థిరముగా కలిగి. నిందింపరాని నిర్మలాశయము (స్వచ్ఛమైన సద్భావము-స్వచ్ఛమైన ఆధారము. స్వచ్ఛమైనభావము)తో సత్కవీశ్వరునకై (మంచికవులచేతకీర్తింపబడినవై, సత్కవీశ్వరులచేత కీర్తింపబడినదై) సోదరి యగుగంగకుసాటిగా నుండును

"ఒక్కొక్కమూల ఒదుగుచు, చతికిలబడి కదలలేవు. అవి యే మదకరులు?" అని యీ పురములోని మదగజములు దిగ్గజములను అసహ్యించుకొనుచుండును. ఆ భారము మోచు జీవనము అరుదు అని ఇట్లు నై దిగ్గజములో అని కులపర్వతములు భావించు నని పండితు లూహింతురనునట్లు మత్తేభసంతానములు భూమిని పెకలించి తల కెత్తుకొనబూనినట్లు వృక్షములను ఒక్కపెట్టున దంతములతో క్రమ్మచుండును.

ఇచ్చటిగుట్టములు సర్పభయకారణ మై చరించెడు హరివాహనమును నిందించి, అలఘు (గొప్పదయిన) పదక్రమముతో (అడుగులవరుసతో, మాటలవరుసతో) అతిశయించు పరమేశ్వరునిగుట్టములను (వేదములను) పరిహసించి. మొనసిన పరపక్షులను (శత్రుపక్షమువారిని, ఇతరములయిన పక్షులను చేరి వర్తించు బ్రహ్మదేవుని వాహములను (హంసములను) నవ్వి, ఆశుగప్రతతి (బాణములసముదాయము. వాయుసమూహము) రాగా జంకి దిక్కులు పట్టెడు దేనేం

ద్రుని వాహనములను (మేఘములను) ఎకసక్కె మాడి రౌతుల చిత్తములకు ఉల్లాసము కలిగించు నిరాఘాట మయిన వేగముతో రణనిరంకుశము లై ఒప్పుచుండును.

ఈ నగరమునందలివారకాంతల కాలిఅందెలు ఘణిలుఘణిల్లని మ్రోఁగినంతనే తాపసులధైర్యము తప్పిపోవును. అంగరాగముల భుగభుగలు విటులకు మరులు పెంచును. మన్మథుని ఈసడించెడి కన్నులకాంతులు జనులను 'తొలఁగుఁడు! తొలఁగుఁ' డని హెచ్చఱికలు చేయుచున్నట్లుండును. ఎఱ్ఱనై తియ్యనగు మోవి కస్తూరితావి యువకులకు నో రూరఁజేయును. దండలు వహించుటకు విటులకె దండ లందుకొని మదాతిశయముతో మందహాసములతో మలయుచుండెడి యీ మగువల చక్కఁదనములు వీరికే కాని మఱి యెవరికిని లేవు.

కరుడువారెడు తాంబూలరసపు ఎఱుపుచేత మోవి గంటులను కప్పుకొనుచు, మెఱుఁగు మీఱెడు గుబ్బల మీఁదఁ గఁ నెలపంకగాట్లు గంధపుపూఁతలచే మఱుఁగు పఱచుకొని మనసులోని భయముచేత తెల్లని కన్నులందు తేటపడు నిద్దురమంపును అణఁచుకొని, విటులప్రేమ తొలఁగినట్లు తెలియఁగా కలుగు వెల్వెలఁబాటును తెచ్చుకోలు తెలివిచేత మాటుపఱచుకొని. మనసులో లేని మక్కువను మాటలచేత విటుల మనస్సులందు హత్తుకొనునట్లు చేయుచు మదనభయమును ఇట్టే నెట్టివైచుచు చతురతానువర్ణపేటి

యైన జాణిగోటి తెల్లవాఱువఱకు జాగరూకతతో కూడు చుండును.

తేలెడికన్నుల నిదుర తేలుచుండఁగా, బుగులుకొను తావులుగల పువ్వులతోఁ గూడినకొప్పులు భుజములందు జాఱుచుండఁగా, చనుఁగవపయిరువున వణఁకెడు నడుములు మూడికణములవలె తోఁచుచుండఁగా చేతితో పోకముడి వదలకుండ పట్టుకొనుచు వారకాంతలు కేళీగృహము నుండి వెలువడుచుందురు.

సంతానవృక్షసమానము లయిన వృక్షసంతానము లతో ఉపవనములు ఎల్లకాలములందును వసంతవిలాసము లతో అలరారుచుండును.

కప్పురపుటనఁటులనుండి తెప్పలుగా రాలెడు కప్పురపుతావులను హరించిన తుమ్మెదలు రాత్రులందు విరామము లేకుండ రతిక్రీడ సలుపుటచేత అలసియుండెడు అంగనలకు ఆ తావులను అందించి వారి శరీరసుగంధము లను తాము కొనిపోవుచుండును.

"ఎలనాఁగా! ఈ విరులు కలయ వెదకి యిమ్ము!" "నీ విరులు (నీవురాత్రులు) వెదకినచో ఇప్పుడు కలఁ" "ఈ సరులు (ఈ దండలు) పూనినచో ఇంతి అద్భుతముగా నుండును." "ఈ సరులు (ఈసాటులు) తెలిసినంతమాత్రాన సంతోషమగునా?" ఇట్లు చమత్కారగర్భితములయిన మాట

లతో విటులమనస్సులకు ఉల్లాసము కలిగించుచు ఇచ్చటి పుష్పలావికలు పువ్వు లమ్ముచుందురు.

పూఁదోఁటలతోడను మణులు పొదిఁగిన బంగారపు మేడలతోడను, చిలుకలమాటలతోడను. రసము చిప్పిల్లెడు చెలువల ఆటపాటలతోడను, కొలఁకుల తేటలతోడను, చతుర్విధము లయిన గృహకోటులతోడను ఈ పురము లక్ష్మీదేవికి కాఁపుర మై విలసిల్లుచుండును.

నవరతికాంత లయిన యీ కాంతలను చూచినావా కాంతా! ఎంతకన్నులపండువుగా ఉన్నారో!"

ఇట్లు వసిష్ఠమహాముని పలుకుచుండఁగా తక్కిన మునులును ఆ పురమునందలి మనోహరదృశ్యములను చూచి సంతోషించినారు. అటుపిమ్మట అందఱును అనంతసరస్సునందు సుస్నాతు లై తక్కిన పంచతీర్థములను సేవించినారు. ముకుందుని పూజించినారు. పదునేడురూపుల స్వాములను ఆరాధించినారు. పిమ్మట భక్తకామితవరదుఁ డయిన శ్రీ వరదరాజస్వామిని కొలువఁగోరి చేరి చేరువ నున్న వేగవతి ఉత్తరతీరమున హస్తిశైలమందు బ్రహ్మదేవుని యజ్ఞవేదియందు ప్రసన్నుఁ డై వపాగంధముఖుఁ డైన ఆ నారాయణుని దర్శించినారు. శంఖము చక్రము గద వరదానాభినయము గల నాలుగుచేతులతో, ఆకర్ణాంతము లై కరుణారసము వెదచల్లు రవిచంద్రనేత్రములతో, చరణసేవకు లైన

జనులయందు ఆదరము ప్రకటించు ప్రసన్నముఖాబ్జముతో, అసమానశృంగారరసమునకు ఆస్థాన మై కాస్తూభముచేత ప్రకాశించువక్షముతో సూర్యబింబ మేమో అనుభ్రమను కలిగించు రత్నమకుటము గల శిరముతో మఱియుఁ జూడఁ దగిన ఆదేవతాసార్వభౌముని చూచి సేవించి అటనుండి కదలి మూఁడుయోజనముల దూరమునఁ గల ఘటికాచలమును కాంచినారు.

ఆ ఘటికాద్రియందు పనస నింబ కదంబాది వృక్షములును, కుంద మందార మాలతీ ప్రముఖలతలును, సర్వర్తు గుణయోగముచే ఎల్లప్పుడును సవించు ఫల రస మకరంద నదులును, రసాలకిసలయ భోజనులచేత మదించి ఎలుఁగెత్తి మనురనాదములు గావించు కోకిలములును, జాతివైర మెఱుఁగని నానాజాతుల మృగములును కలవు. ఒక్క ఘటికాకాలము సేవించినవారికి ఇష్టము లైన కోరికలను ఇచ్చటనే ఘటించును, పూర్వజన్మకృతము లయిన పాపములను అన్నింటిని తొలఁగించును. ఇతరశైలములు దీనికి సాటి కాఁగలవా? అనునట్లు నెమళ్ళు షడ్జస్వరమున ఘోషించుచుండును. అచ్చటి సింహములు తాము మృగపతు లగుట చేత ప్రకృతిసిద్ధము లయిన పగలు మఱిచి పగలుఁబడ మృగముల నన్నింటిని దయతో పాలించుచుండును.

ఆ పర్వతము చటియలందుఁ గల రత్నాలకాంతులు దట్టముగా క్రమ్మికొనియుండుటచేత బంగారుకొండను పో

యుండును. విష్ణుపదజనిత జలసాంగత్యముచే స్వర్గలోకమును సరకు గొనకుండును. ధాతు ప్రత్యయాగమ సమన్విత మగుట చేత (క్రియాపదములు, ప్రత్యయములు ఆగమములు అను వానితో కూడిన దగుటచేత, గైరికాదిధాతుపులకు సంబంధించినపన్నెలపుట్టుకలతో కూడిన దగుటచేత), శబ్దశాస్త్రమునన్ను ఛాయవలె నుండును. సరములందు (సరస్సులందు-హారములందు) ఎడతెగక చలించు కంకణములందు (కడియములందు-నీటిబొట్టులందు) ఆసక్తి (కోరిక-సంపూర్ణమైన కలయిక) కలుగుటచేత నృపవిలాసము వహించియుండును. భృగుజటీ ప్రముఖయుక్తిచేత (ఉన్నతములైన మట్టిచెట్లు మొదలగువానిచేత భృగుముని మున్నగువారిచేత) ఋష్యాశ్రమము పలె ఉండును తృప్తి పొందిన మృగపక్షిసముదాయముల దీర్ఘఘోషణములు వర్తిల్లుచుండుటచేత వనములను పరిహాసము చేయుచున్నట్లుండును. ఉన్నతిము లయినశిఖరములందలి నెమళ్ళచూపులకు పాములనెడుపగ్గములు జాతిపోవుచుండఁగా సారథి యైన అరుణుఁడు వానిని మఱల బుజ్జగించి చేపట్టుటకు కొంతన్యవధి పట్టుచుండుటచేత మధ్యాహ్నవేళ అక్కడ రవిరథము గమనమునకు విలంబము కలుగుచుండును.

చతియలందలి మాణిక్యసంపదలచేత ఆ ఘటికాచలము కాంచనాచలమును మెచ్చదు. మేఘుఁగులు మోడి పటికపుఱాళ్ళ సొంపుచేత వెండికొండను లక్ష్యపెట్టదు. నెలఱాళ్ళ ద్రవములు ఏఱులై ప్రవహించుచుండుటచేత

మంచుకొండను మన్నింపదు. శిఖరములందు బంగారము నిగనిగలాడుచుండుటచేత హేమకూటమును ఎగతాళి చేయును. పరిమళించెడు గంధపుచెట్లు కలిమిచేత మలయ పర్వతమును చులుకన చేయును. అసంఖ్యాకములయిన చామరసమూహములు ఒనఁగూడియుండుటచేత తన నగ రాజభావమును ప్రకటించుచుండును. ఆ ఘటికాచలము నందు పటికపుపూసలమాల చేపట్టి ఘటికామాత్రము జపము చేసినయెడల ఘనము లగు సిద్ధులు ఒనఁగూడును

ఆ శైలమునందు ఫలతీర్థ మను సరస్సు కలదు.

దానిసమీపమున కొందఱు మునీశ్వరులు తపోనిష్ఠు లై యున్నారు. సప్తర్షులు వారిని విలోకించి "మీకు అర్థ కామములయందు ఆసక్తి యెంతమాత్రమును లేదని మీ శాంతియును ధర్మనిష్ఠయును చాటుచున్నవి. మీరు ధ్యానించు మాధవుఁడు మోక్షము నిచ్చునుగదా! ఇంక మీరు ఏ లోకికతో తపస్సు చేయుచున్నారో మా కెఱిఁగింపరా!" అని ప్రశ్నించినారు. అందుల కా మునీంద్రు లిట్లు పలికినారు.

"మహర్షులారా! మీ రన్నట్లే మాకు ధర్మార్థకామ మలలో దేనియందును మక్కువ లేదు. ముక్తినిమిత్తమై నారాయణునిగుఱించి తపము చేయవలె నను లోకిక మాత్రము కలదు. ఆ స్వామిని కన్నులార చూడవలె నను

నోరికకూడ ఉన్నది. ఇంక మేము ఇక్కడనే తపస్సు చేయుటకు ఇంకొకగొప్పకారణ మున్నది. చెప్పెదము. వినుండు !

మునుపు మేము అందఱమును స్వర్గమునందే ఉండి రమాకాంతుని ఉద్దేశించి తపము చేసెడివారము. అశరీర వాణి ఒకనాడు మాకు ఈ విధముగా హితోపదేశము చేసినది.

'మునులారా! వినుండు! ఇచ్చట విష్ణుసాక్షాత్కారము అతిదుర్లభము. ప్రయాససాధ్యము. ఘటికాచలమునందయినచో శ్రీహరి శీఘ్రముగా ప్రత్యక్షమగును. కృతయుగమునందు సప్తర్షులు అచ్చట తప మొనర్చి హరిసాక్షాత్కారము పొందిరి. అప్పుడు వారితోడ బాటు మీరును ఆ భగవంతుని దర్శింపగలరు కనుక మీరు ఘటికాచలమునకు పోయి తపము చేయుడు'.

గగనభారతిపలుకులు విన్నవెంటనే మేము ఈ కొండకు వచ్చినాము. ఆ నాటినుండి యీ నాటివఱకును ఇట్లు తపస్సు చేయుచున్నాము."

ఆ మునులిట్లు చెప్పగా వసిష్ఠాదులయిన యేడుగురు ఋషులును ఆకాశవాణి పలుకులనుబట్టి ఆ కొండమీద తమకువిష్ణుసాక్షాత్కారము లభింపగలదను విశ్వాసము కలుగుటచేత ఘటికాచలేంద్రుడయిన ఆ జగన్నాథుని వేదచోదిత మైన మనుధ్యానప్రకారముగా ఆరా

ధించినారు. సర్వజీవుల హృదయములయందు వర్తించుట చేత సర్వజ్ఞుడై యున్నను శ్రీహరి ఆ మునీంద్రుల చిత్త స్థిరత్వమును పరీక్షించుటకై వినోదార్థము కొంచెము కాల యాపనము చేసినాడు. అందుల కా ఋషివర్యులు దుగ పిల్లుచు "అయ్యయ్యో! సకలజనరక్షకుడైన శ్రీకాంతుడు మా కోరిక తీర్చడయ్యెను. మా భాగ్యములు ప్రతికూ లము లయ్యెను. మేము నారద వాయునందన సనందనాదుల వంటి ప్రియభక్తులగు కాకపోయితిమి. యమ నియమాది యోగములచేత నిశ్చల మగుచిత్తము గల మహాత్ములకే తప్ప మిగిలినవారికి ప్రమత్తతచేతనో, సహనము లోపించుట చేతనో, కష్టపడలేకపోవుటచేతనో, శుచిత్వము లేకపోవుట చేతనో, మనస్సు భ్రమించుటచేతనో, అలసులతో సంచ రించుచుండుటచేతనో, భక్తి లేకపోవుటచేతనో, శక్తి లేక పోవుటచేతనో, విశ్వాసము లేకపోవుటచేతనో ధ్యానము నిలుపదు."

ఈవిధముగా తలంచి ఎప్పటికప్పుడు తటస్థించెడి అంత రాయములను గమనించి నెట్టివైచుచు వారు పరమభక్తి తత్పరు లై తపము చేసినారు. అంతలో దిగంతములదాక పట్టుపగలిటి వెలుంగువంటి వెలుంగు నింపుచు బ్రహ్మాండ కటాహమును దూసికొనిపోవు రత్నముల కాంతులు గల ఒక దివ్యకిరీటము గోచరించినది. దానికి దిగువనే కోటిసూర్య బింబములు (మబ్బు మబ్బుతో ఒరసికొనగా పుట్టెడువెలుం గులు) కూడ నాటి గాని పచ్చనివన్నెలు ప్రసరించుకన్నులు

గోచరించినవి. ఆ కన్నుల మెఱుఁగులకు రత్నమయము లయిన కేయూరములు హారములు కంకణములు మంజీర ములు మున్నగు భూషణముల ప్రకాశములు తోడ్పడినవి. ఆ ప్రకాశములతోఁ బాటు దక్షయజ్ఞధ్వంసకుఁడయిన వీర భద్రుని రౌద్రమును మఱిపించుచు భయంకరము లయిన గోఱ్ఱలనుండి నిప్పురవ్వలువలె ఎట్టినిమెఱుఁగులు చెలరేఁగ సాఁగినవి. రాక్షస హృదయములు ప్రక్కలగునట్లు సింహ గర్జలు వినఁబడఁజొచ్చినవి. శిరస్సునుండి జాఱిపడు పచ్చని కేసరములు ఆకాశలక్ష్మిగృహద్వారమున కల్పింపఁబడిన పసిఁడిమాలలో అనుకరించు ఒప్పినవి. కుబేరకుమార భయం కరబిరుద హిరణ్యకశిపు వధమును చీల్చి కుఠారకఠోరము లుగా ప్రసిద్ధి కెక్కిన గోళ్ళతోడిచేతులు గోచరించినవి. దిగ్గజములు గంగాజలములను తొండములతోఁ దెచ్చి ఆదివ్య మూర్తికి అభిషేకము సలుపుచున్నవి. ఆ అభిషేకజలబిందు వులు మూఁడులోకములను తడుపుచున్నవి. వేదనైభవము నకు సాపరమయిన ఆ దివ్యమూర్తిని కేంద్రముగా చేసి కొని దిక్పాలకులును వాణీపతి గౌరీపతులును గుమిగూడి యున్నారు. సకల దుష్టరాక్షసుల పాలిటి యమదండములు నలె ఆస్వామి భుజదండములు పొలుపొందుచున్నవి. విశ్వా వసువు, తుంబురుఁడు, నారదుఁడు మొదలగు దివ్యగాయ కులు ఆ జగన్నాథునినామమున అంకితము లైయుండు బిరుదావళులను ఉదాహరణ మంగళాష్టకములను దండ కాది ప్రబంధములను ఒక్కమాఱుగానే గానము చేయు చున్నారు. రంభ మొదలగు అప్సరసల నృత్యములు తగి

నట్లు దివ్యదుందుభులు మ్రోగుచున్నవి. పూలవానలు కురియుచున్నవి.

ఇట్లు ప్రత్యక్షమైన శ్రీనరసింహదేవుని చూచిన సప్తమహర్షులు భయకంపములతో ఆశ్చర్యసంభ్రమములతో, భక్తిసంతోషాతిశయములతో నమస్కరించి, చేతులు జోడించి యీవిధముగా స్తుతించినారు.

"మదగర్వత్యాగము చేసిన జనులకు ఇష్టార్థములను దానము చేయు కల్పవృక్షమై అజ్ఞానమును చీల్చి వైచువానికి, పూర్వజన్మపాపము లను మేఘములకు మహావాయువై రక్కసులను రూపుమాపువానికి, ఇంద్రుడు మున్నగు సురపల్లవుల కిరీటరత్నములకాంతులు పాదములకు విరాజనము లై దయచే విరాజితుడగువానికి, భక్తచక్రము లను ఉద్ధరించుచు చక్రము ధరించువానికి నమస్కరించి, స్తుతులొనర్చి, బద్ధాంజలుల మై శరణాగతుల మై ప్రార్థన చేసెదము.

శ్రీనృసింహా! నీ దివ్యలీలలు అప్రమేయములు. యోగీంద్ర హృదయ గేయములు. మహేంద్ర మహేశ వాణీశులకే జ్ఞేయములు. దివ్యమునివాగ్గేయములు. సోమకాసురుడు పరించిని వంచించి వేదములను హరించి సముద్రమున దాగుకొనగా మహామీనమువై వానిని వెంబడించి, పధించి, వేదములను తిరిగి తెచ్చి బ్రహ్మకిచ్చినావుకదా! వైదికాచారమార్గము రక్షించినావుకదా! దేవతలును రాక్ష

సులను అమృతము పుట్టుటకొఱకై మందరపర్వతము కవ్వముగా పాలకడలిని మథించునప్పుడు ఆ పర్వతము సముద్రమందు మునిగిపోగా, కూర్మరూపము ధరించి దానిని పైకెత్తి కీర్తిగాంచినావుకదా? హిరణ్యాక్షుడు పాపబుద్ధియై ఈ భూమిని చాపగా చుట్టి, పాతాళలోకమందు పెట్టగా వరాహమూర్తివై దానిని మఱల ఉద్ధరించినావుకదా! 'సర్వమును శ్రీమహావిష్ణువే' అని పలికెడు ప్రహ్లాదునిపై అలిగి 'ఆ హరిని ఇక్కడ చూపు' మని హిరణ్యకశిపుడు ఉక్కకంబమును అఱచేత చఱచినంతలో నరసింహమూర్తివై ఆస్తంభమును పెటపెట చీల్చుకొని వెలువడి ఆ రాక్షసుని సంహరించినావుకదా! ప్రహ్లాదుని రక్షించినావుకదా! వామన బ్రహ్మచారివై బలివలన మూడడుగులనేల దానముగా గ్రహించి త్రివిక్రమరూపము దాల్చి, భూమ్యాకాశములను రెండడుగులతో ఆక్రమించి మూడవఅడుగు అతనితలపై పెట్టి అతనిని పాతాళమునకు చేర్చితివికదా! ఇంద్రునికోరిక తీర్చితివికదా! జమదగ్నికుమారుడవుగా పుట్టి, తండ్రికి కీడు చేసిన కార్తవీర్యార్జునుని సంహరించి వెదకి వెదకి క్షత్రియులను వధించి వారి రక్తధారలతో ఏడుమడుగులు నిండించి వానితో పితృఋణము తీర్చినావుగదా! భూభారము మాన్పినావుకదా! రావణుడు ఇంద్రాదిదిక్పాలకులను, సిద్ధులు, సాధ్యులు మొదలగు ఖేచరులను పట్టి బాధింపగా, వానిని సంహరించుటకై శ్రీరాముడను నామమున దశరథమహారాజునకు పుత్రుడవుగా పుట్టి, సీతాదేవిని పెండ్లాడి, తండ్రి

అజ్ఞచేత పదునాలుగు సంవత్సరములు వనవాసము చేసి, సీతను హరించిన రావణుని త్రుంచి సీతాసమేతుడవై రాజ్యము పొందితివికదా! సర్వలోకస్తుతు లందితివికదా! కృష్ణునికి అగ్రజుడవై రోహిణీగర్భమున ఉదయించి ప్రలంబాదు లయిన దుష్టరాక్షసులను తునుమాడి దిక్కులందు నీ కీర్తి నిండించితివికదా! త్రిపురాసురుల భయాన్ని నశింపఁజేయుట కై బుద్ధావతారము తాల్చి మోహనము లయిన అనేకశాస్త్రప్రసంగములచేత ఆరాక్షసస్త్రీల శీలము చెడునట్లు చేసితివికదా! ఇఁకమీఁద కల్కిమూర్తి వై మ్లేచ్ఛులను అణఁచివైతువుకదా! ఈశా! విదీశా! (జ్ఞానులకు అధిపతి వయినవాఁడా!) భావనాతీత మయిన నీ దివ్య రూపమును సందర్శించినాము. మా తపములు ఫలించినవి. సర్వేశ్వర! నమస్తే నమస్తే నమః."

ఇట్లు సప్తర్షులు నృసింహదేవుని బహువిధములు స్తుతించినారు."అని నారదుఁడు భృగుమునికి వినిపించెఁడు.

3

నారదమహర్షి భృగుమహర్షికి మఱల ఈ విధముగా చెప్పనారంభించెఁడు.

సప్తమహర్షులు శ్రీనృసింహదేవుని బహువిధములు నుతించి పిమ్మట 'దేవా! ఇంద్రాదు లయిన దేవతలకు

అందఱకు వెఱపు పుట్టించు నీ రూపమును చూడలేకున్నాము శాంతస్వరూపము ధరింపుము!" అని ప్రార్థించినారు. అంతలో నానారత్నమయ మైన ఒకదివ్యవిమానము గోచరించినది. వారు ఆ విమానద్వారమున ప్రవేశించి దక్షిణదిశయందు ప్రమథగణసమేతుఁ డై యున్న మదనవైరిని చూచినారు. శంఖచక్రధారి యై వివృతముఖుఁ డై పద్మాసన మవలంబించి. యోగపట్టికతోకూడిన ఊరుపులమీఁద రెండుచేతులు నిలిపి. మేఁగిరిమీఁది సూర్యబింబమువలె శిరముమీఁద మకుటము కీలించి, బాలచంద్రునిమీఁద బాలచంద్రుని పోలు నట్లు నుదుటిమీఁద ఊర్ధ్వ పుండ్రము గలిగి అంగారకుని వలె తేజరిల్లు త్రిలోచనుఁ డైన నృసింహునిఁ గాంచినారు.

స్వామి కనుబొమ లప్పుడు తాపములను గూఱి చూచి భేదించు నిమిత్తము వంగిన ధనుస్సులవలె నున్నవి. ముఖ పద్మము తుమ్మెదల నాకర్షించుచున్నది. మోవి మంకెన కాంతితో తీవి మీఱుచున్నది. నేత్రములయందు కారుణ్యము జాలువారుచున్నది. ముల్లోకపు దొరతనము తెలుపుచున్నట్లు కరమున మూఁడురేఖలు గోచరించుచున్నవి. తమ్మిచెంత నున్నతుమ్మెదవలె ఱొమ్మునందలి కౌస్తుభము ప్రకాశించే శీవత్సము శోభిల్లుచున్నది. పూర్వపురూపు మార్చుకొను ఐంద్రజాలికుని విధమున స్వామి రౌద్రము ప్రకటించు రూపము విడిచి సౌమ్యరూపము ధరించినాఁడు.

అప్పుడు వసిష్ఠాదులు ఆ జగన్నాథుని బహువిధముల వినుతించి దేవా! పదునెనిమిది నిమిషములు కాష్ఠ. ముప్పది

కాష్ఠలు కళ. ముప్పది కళలు క్షణము. ఆఱు క్షణములు గడియ. రెండుగడియలు ముహూర్తము. ముప్పది ముహూర్తములు అహోరాత్రములు పదునైదు అహోరాత్రములు పక్షము. రెండుపక్షములు ఋతువు. మూఁడు ఋతువులు అయనము. రెండు అయనములు సంవత్సరము. మనుష్యసంవత్సరములు వేయి దేవతలకు ఒక్కదినము దేవతలసంవత్సరములు మూఁడువేలయేండ్లు నాలుగు యుగములు. రెండువేల చతుర్యుగములు బ్రహ్మకు అహోరాత్రము. ఆ అహోరాత్రములు మూఁడువందలఅఱువది అతనికి ఒక్కసంవత్సరము. అట్టి నూఱుసంవత్సరములు అతని ఆయుఃప్రమాణము. ఆ కాలమంతయు నీకు ఒకనిమేషము. ఆ కాలమున బ్రహ్మాండము బ్రహ్మలో లీన మగును. అప్పుడు నీవు మఱొకబ్రహ్మాండము సృష్టింతువు. ఇంతటికి నీవే మూలకారణమవు. బ్రహ్మాదిదేవతలు గ్రహింపలేని నీ ప్రభావమును మేము వర్ణింపఁగలమా?" అనఁగా భగవంతుఁడు "ఇన్నాళ్ళు ఏకచిత్తతతో నన్ను మీరు తలంపలేదు గనుకనే నేనుసాక్షాత్కరింపలేదు. తపస్సునకు దృఢభక్తి ముఖ్యహేతువు కదా! నేను దుష్టులను శిక్షించుటకును శిష్టులను రక్షించుటకును భూమియందు అవతరించుచుందును. హిరణ్యకశిపుని వధించుటయును, ప్రహ్లాదుని రక్షించుటయును ఇందులకు నిదర్శనములు గదా! మునులారా! మిమ్ములను మెచ్చినాను. ఇన్నాళ్ళు మీరు చాలా శ్రమపడినారు. మీ కేమి కావలెనో కోరుకొనుఁడు! ఇచ్చెదను." అన్నాఁడు. మును లీపలుకులకు మిక్కిలి సంతోషించి యిట్లు కోరినారు.

"దేవా ! ఇంద్రాదులకును అరయరాని నీ దివ్య మూర్తిని అరయుటకంటె వర మే మున్నది ? నీకు అమృత ఫలనామము, భక్తోచితనామము ఎట్లుకలిగెనో వినగోరెదము."

అంతట దేవుడు "అమృత మనగా మోక్షము. అ ఫలము అమర్చి అమృతఫలనామము పొందినాను. శమయుక్తులయిన భక్తుల కాంక్షితము అమర్చి భక్తోచితనామము పొందినాను. ఈ పర్వతశిఖరమునఁ గల రెండు తీర్థములకు ఈ నామములే సార్థకము లై ఒప్పుచున్నవి. దివ్యమునులు ఈ తీర్థమున స్నాన మాడి మిక్కిలి మహత్త్వ మొందినారు. నా భక్తులు ఇందు మునిగినయెడల మోక్షము పొందఁగలరు. నారాయణగిరి నా మొదటి ఆశ్రమము. రెండవది ఘటికాచలము. మూడవది వృషభాద్రి. నేను ఈ మూఁడుతావులందును విశ్రమింతును." అనఁగా వారు "దేవా! నేటినుండి యీ పర్వతము మీఁదఁ గల ఏఱులు, మడుఁగులు మూఁడు యోజనములదాఁక మోక్షదము లగును గాక! ఇందు పంచరించు జనులకు ఎట్టి ఆపదలును రాకుండునుగాక! దయ శాంతి దాంతి ధర్మబుద్ధి కలుగునుగాక ! మృగములు అన్యోన్య మైత్రితో బదుకునుగాక! శబరులు, యవనులు మొదలగు అటవికులు జ్ఞాన వైరాగ్య ధర్మములు పూనుదురుగాక! నెలకు మూఁడువానలు కురియుచు భూమి బాగుగా ఫలించుచుండునుగాక! నాలుగు వర్ణములవారు తమ తమ కులాచారమును పాలించుచుందురు గాక! అని వేఁడు కొనఁగా

దేవుఁడు వారి కా వరము లిచ్చి అదృశ్యుఁ డయినాఁడు. బ్రహ్మాదులు ఆ గిరిమహిమను, వసిష్ఠాదుల భాగ్యమును నృసింహుని కరుణను కొనియాడుచు నిజనివాసముల కేఁగి నారు. వైఖానసులు బ్రహ్మదేవుని ఆజ్ఞ వలన అచ్చట నిలిచి నృసింహుని అర్చించుచు నివసింపఁ జొచ్చినారు.”

ఇట్లు నారదుఁడు వినిపింపఁగా భృగువు “మునీశ్వరా! విష్ణువు సకలజీవులకు అంతరాత్మకదా! ఆదేవునకు ఆవాహ నము ఉద్వాసనము ఎట్లుకలుగును?” అని ప్రశ్నింపఁగా నారదుఁ డిట్లు చెప్పినాఁడు. అగ్ని లోకములో ఎంతైనను ప్రత్యక్ష మగుచున్నను శమీగర్భమున పసించునట్లు నారా యణుఁడు సకలజీవులకు అంతరాత్మ యై యుండియే మఱి యొకచోటఁ గూడ వసించును. కనుక ఆవాహనోద్వాసన ములు సంపూర్ణ స్థితితో అంగీకరించును.” భృగు వప్పుడు “అయ్యా! వైఖానసులవఁగా ఎవరు?” అని అడిగినాఁడు. నారదుఁడందుల కిట్లన్నాఁడు. పూర్వము పరుణుఁడు యాగము చేయుచుండఁగా అచటఁ గల జలదవ లను అచ్చ రను గన్న విధాతకు రేతస్సు స్ఖలిత మయినది. దానిని ఆయన ఆకుదొన్నెతో అగ్నియందు విడువఁగా అందు అర్చి భృగువులు, అంగారపిండమునందు అంగిరుఁడును అ వీయను, విఖనసాంగత్యముచేత విఖనసుఁడును ఉదయించినారు. ఆ విఖనసుని వంశమువారు వైఖానసులు వారు సాలమంత్ర తంత్రార్థరహస్యవిదులు, పంచవిధ బేరపూజాపరాయణు లై యున్నారు.” అనఁగా పంచబేరార్చన మెట్లుఁడు నని

అడిగినాఁడు భృగుమహర్షి. ధ్రువ కౌతుక స్నాపనోత్సవ బల్యంబువులు బేరపంచకము. బాలాలయము ఆఱవది. దానిని పాంచరాత్ర మంద్దురు. శ్రీకృష్ణుడు, పురుషుఁడు, సత్యుఁడు, అచ్యుతుఁడు, బుద్ధుఁడు ఆ ధ్రువాదులందు క్రమముగా ఆవాహ్యులు."

అని నారదుఁడు బదులు పలుకఁగా భృగుమునీంద్రుఁడు తిరిగి యిట్లడిగినాడు.

"మొదటి బేరము ఆవాహనము కాఁగా అది యితర బేరములను పొందుట యెట్లు? ఈ సందేహము నాకు తీఱకున్నది. దీనిని నీవు తీర్చవలయును."

నారదుఁ డప్పు డిట్లు చెప్పినాఁడు.

"ఒకదీపమువలన రెండవదీపము పుట్టుచున్నది. అయినను రెండింటియందును తేజము లేదా? అట్లే శ్రీహరి అభిముఖభావమే ఆవాహనము అని చెప్పఁబడుచున్నది. దాని నుండి తక్కినవి కలుగును."

మఱల భృగుమహర్షి "అయ్యా! విష్ణ్వర్చకు లయిన బ్రాహ్మణులకు తక్కువతనము కలుగు నందురుగదా! అది సత్యమా?" అని ప్రశ్నింపగా నారదుఁడు "పూర్వము బ్రహ్మదేవుఁడు విష్ణ్వర్చనము వైఖావనసులకు విధించినాఁడు అది వారికి తక్కువతన మెట్లు కలిగించును? కూలికై పూజ చేయువారి కట్టిదోషము కలదు. కాని బుద్ధిపూర్వకముగా

శ్రీనృసింహుని అర్చించువారి కది యెట్లు చెల్లును? ఒకప్పుడు వైఖానసులు వసిష్ఠమహర్షిని 'స్వామీ! మే మిచ్చట నిశ్చింతుల మై యెట్లుండఁగలము?' అని అడుగఁగా ఆ మహనీయుడు బదరికాశ్రమము, సాలగ్రామపర్వతము, అయోధ్య, ద్వారక, కాశి, మధుర, నైమిశారణ్యము, అవంతి, నారాయణగిరి, నీలాచలము, కురుక్షేత్రము, కంచి మొదలగు పుణ్యక్షేత్రములు, సుప్రసిద్ధములు, వేగవతి, ఉత్తరపుటొడ్డున బ్రహ్మదేవుని యజ్ఞవేదికప్రాంతమునఁ గల పుణ్యకోటి విమానమునందు వసించు స్వామి భక్తులకు కోరినవరములిచ్చును. ఈక్షేత్రములందు సచ్చరిత్రులు, సత్యసంధులు అగు విద్వాంసులు నివసించుచుందురు. ఎచ్చట ఏమూర్తి భయమో అచ్చట ఆ మూర్తిని పరమభక్తితో కొలుచుచుందురు. విశేషించి యీ ఘటికాచలము ఎల్లరు కొనియాడఁదగినది." అని చెప్పినాఁడు అంతట వారు 'అయ్యా! ఇది విషమస్థలము కదా! మేము ఇందు చరించుట దుష్కరము కాదా?' అని అడిగినారు. అందుల కాయన ఈ కొండ పరిసరము అంతటిని ఎవరయిన సమస్థలము కావించినచో మీరు సుఖనివాసము చేయవచ్చును." అని సెలవిచ్చినాఁడు.

అప్పుడు వైఖానసులు నృసింహదేవుని దర్శించి "స్వామీ! నీవు ఆర్తజనశరణ్యుఁడవు కదా! మా విన్నపము ఆలించి మా భయము దీర్పవలయును." అని ప్రార్థించినారు. స్వామి "మునులారా! మీకు కావలసిన దేమో

చెప్పుఁడు! ఇచ్చెదను.' అని పలికినాఁడు. అంతట వారు 'దేవా! మేము నిత్యము మీసేవ నిరాటంకముగా చేయఁ గలుగునట్లు ఈకొండ చుట్టును మేము సంచరించుట కను కూలత ప్రసాదింపవలయును' అని కోరినారు, స్వామి "అట్లేఅగుఁగాక" అని ఆంజనేయుని స్మరించినాఁడు. ఆవాన రోత్తముఁడు తతణమే వచ్చి మ్రొక్కి నిలిచి 'దేవా! ఏమి సెలవు?' అని అడిగినాఁడు. "అంజనానందనా! ఈ శైలమ మీఁద ఈ మునులు నివసింపఁదగునట్లు ఈశాన్యదిక్కు భూమి సమతలము గావింపుము," అని భగవంతుఁ డా యిచ్చినాఁడు. అంతే కాక 'హనుమా! నీపేర ఇచ్చట ఒ గ్రామముకూడ వెలయింపుము!' అని సెలవిచ్చినాఁడు. అసమానుట్టమంతుఁ డయిన హనుమంతుఁడు క్షణమాత్ర ముననే ఆ ఆజ్ఞను నిర్వర్తించి తన పేర హనుమ గ్రామము నిర్మించి భగవంతుని సెలవు గొని నిజనివాపమున కేఁగినాఁడు వైఖానసులు నిశ్చింతులై అందు నివసించుచు నరహరిని సేవించుచు ఒకప్పుడు స్వామికి కల్యాణము గావింప సమకట్టి నారు. దేవాలయమును. పరిసరములను అతిసుందరముగా అలంకరించినారు. ఆన్ని వైపుల భగవత్కల్యాణోత్సవవార్త చాటింపించినారు. ఆ వార్త విని నానాదేశముల రాజేం ద్రులును తమతమ వైభవములకు తగినవిధమున ఘటికా చలమునకు వచ్చినారు. వ్యాసాదిమునీశ్వరులతో వాఘూల మునింద్రుఁడును వచ్చినాఁడు. వీణాపాణులై దేవలోక

గాయకులు ఏతెంచినారు. మఱి పరిసరములందు గల చతుర్వర్ణముల వారును తమ తమ కులములకు తగిన కానుకలు గొని స్వామిని సేవింపవచ్చినారు.

అప్పుడు వైఖానసులు మిక్కిలి సదాచారుడును కులవృద్ధుడును అగు ఒక శాంతమూర్తిని ఆచార్యునిగా వరించినారు. హోమపూర్వకముగా గరుడకేతన మెత్తి వాద్యఘ్నులు విస్తరింపఁజేయించినారు. అంతలో ఎదివార మాతులై హర విరించి సురేంద్ర ప్రభృతులయిన వేల్పు లదఱును నృసింహకల్యాణోత్సవము చూడ వచ్చినారు. ఆ కళ్యాణ సమయమున గజరాజములు కనకకుంభము లెత్తి జలక మాడింపఁగా, వెన్నెలను ఒరచెట్టు వెలిసిట్ట చీర గట్టి, తుమ్మెదలు క్రమ్మగొనియుండు పద్మమున ఆసీన యై యుండు ఇందిరాదేవి నెత్తమ్మిజేకులను సోగకన్ను లెత్తి మునివరులు మంగళాష్టకములు చదువుచు తేర యెత్తఁగానే హరికి తలఁబ్రాలు పోసినది. అంతట వైఖానసులు కౌతుకబంధములు కూర్చి, వాద్యములు భోరన మ్రోఁగుచుండఁగా, ముత్యాలగొడుగు లెత్తించి, భాగవతులు ఆడుచు పాడుచుండఁగా, అచ్చరలు నృత్యములు చేయుచుండఁగా, రత్నాల అందలములం దుంచి ఆ పురాణదంపతులను అతి వైభవముగా తిరువీథులందు ఊరేఁగించి తిరిగి నగరిలోనికి తీసికొనివచ్చి నానావిధ మధురపదార్థములు నివేదించి సేవించినారు.

ఘటి[illegible]చల మాహాత్మ్యము

[illegible] విధముగా ఆగమోక్త పద్ధతిని తొమ్మదిదినములు [illegible]సులు స్వామికల్యాణోత్సవములు జరిపి ఎల్ల [illegible]దము కలిగించినారు. పిదప నిత్యోత్సవముగా [illegible] చేయుచు భక్తుల కెల్లను స్వామికృపాభాగ్యము [illegible]యుచుండఁగా, భగవంతుఁడులో కానుగ్రహకాంక్షి [illegible]ట వారి సేవ లందుకొనుచున్నాఁడు. సకల [illegible] [illegible]లు [illegible] తింపఁదగిన ఈ ఘటికాచలమాహాత్మ్యంథము మోక్షము గోరి [illegible] నవారికి [illegible]చ్చును. ధనముకులకు అత్యంతధన మి[illegible]చ్చును. పుత్రార్థులకు పుత్రలాభ[illegible] చేక[illegible]ర్చును. ఆ[illegible]కములకు పూర్ణాయువు ప్రసాద[illegible] సకల పాపము[illegible]ను నశింపఁజేయును. బహురసాలంకారసమ[illegible]న్వితమై నానా[illegible]ర్థభాసురమై పాఠకులకు శ్రోతలకు భాగ్యప్రదమై నక్ష[illegible]తములు సూర్యచంద్రులు పర్వతములు సముద్రములు ఉండ[illegible]నంతకాలము జగమున ప్రకాశించుచుండును.

ఇట్లు నారదమహర్షి చెప్పఁగా భృగుమునీంద్రుఁడు 'మహాత్మా! నీవలన నేను ధన్యుఁడ నైనాను.' అని ఆ దేవర్షిని ఎన్నోవిధముల కీర్తించి హరిధ్యానపరాయణుఁడైనాఁడు.

అని సూతమునీశ్వరుఁడు శౌనకాదిమహర్షులకు ఘటికాచలమాహాత్మ్యము వినిపింపగా వారు మిక్కిలి సంతసించి ఆ పౌరాణికుని బహురీతుల కొనియాడినారు.

ఘటికాచలమాహాత్మ్యము

సర్వము సంపూర్ణము.

[illegible]శాఖా గ్రంథాలయము
చీరాల.